పోరు తెలంగాణ
పత్రిక ప్రకటనల కోసం
మరియు
చందాదారులుగా
చేరండి చేర్పించండి
వివరాలకు
సంప్రదించండి సెల్
8555918136

# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 శనివారం 12-09-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వేల : 04

## ఇమ్రాన్ ఖాన్ చనిపోయారా? పాక్ జర్నలిస్టు సంచలన వ్యాఖ్యలు.. నిజమెంత?

- 2023 నుంచి జైల్లో ఉన్న ఇమ్రాన్ ఖాన్
- ఆయన ఆరోగ్యంపై పార్టీ, కుటుంబంలో తీవ్ర ఆందోళన
- చనిపోయి ఉంటారని జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు
- సైన్యంలోని సీనియర్ వర్గాలు అనధికారిక సమాచారంతో చెప్పినట్లు వెల్లడి
- ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతివ్వకుంటే లాంగ్ మార్చ్ చేపడతామన్న పీటీఐ పార్టీ



పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆయన జైల్లోనే మృతి చెంది ఉండొచ్చంటూ పాకిస్థాన్‌కు చెందిన ఓ సీనియర్ జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అయితే ఈ వాదనకు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. - మిగతా 2 లో

## 26 ఏళ్ల తర్వాత బట్టబయలైన క్లింటన్ రహస్యం

- 26 ఏళ్ల నాటి రహస్యాన్ని బయటపెట్టిన సీనియర్ జర్నలిస్ట్ సూసన్ పేజ్
- 2000లో పాక్ పర్యటనకు క్లింటన్ డెకాయ్ విమానం వాడారని వెల్లడి
- ఇటీవల తుర్కియేలో ట్రంప్ కూడా ఇలాంటి వ్యూహాన్నే అనుసరించారని కథనం
- క్లింటన్ యంత్రాంగం జర్నలిస్టులకు ముందుగా చెప్పగా, ట్రంప్ సర్కార్ చెప్పలేదు
- ఇద్దరి పర్యటనలకూ తీవ్ర భద్రతాపరమైన ముప్పులే కారణమని స్పష్టీకరణ




అమెరికా అధ్యక్షుల భద్రతకు సంబంధించి 26 ఏళ్లుగా గోప్యంగా ఉన్న ఒక కీలక రహస్యం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. 2000వ సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లినప్పుడు, - మిగతా 2 లో

# గోదావరి జలాల వినియోగంపై
# సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- గోదావరి నది జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం
- ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి నీటిని లిఫ్ట్ చేయాలని సీఎం ఆదేశం
- కాళేశ్వరం బ్యారేజీల భద్రతపై ఎన్డీఎస్ఏ సూచనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం
- భూ నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించేందుకు కార్యాచరణకు ఆదేశం




గోదావరి నది జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా

## ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ



- తెలంగాణలో రేపే 'ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల' పథకం ప్రారంభం: నియోజకవర్గానికి వెయ్యి మందికి లబ్ధి
- బీసీ మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- విధి విధానాలను రేపు ప్రకటించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బీసీ) మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం- మిగతా 2 లో

## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు



- సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడిపై కేటీఆర్ విమర్శల దాడి
- మేం టీ-హబ్ కడితే.. రేవంత్ 'అనుముల హబ్స్' తెస్తున్నారని ఎద్దేవా
- సీఎం సోదరుడి సంస్థకు రూ. 200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టారని ఆరోపణ
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి భూ కేటాయింపులపై సమగ్ర విచారణకు డిమాండ్
- ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని, కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డిపై బీఆర్ఎస్ - మిగతా 2 లో

## కంపెనీల్లో మహిళా బాస్‌లు చాలా తక్కువ.. పార్లమెంటులో కేంద్రం వెల్లడి



- దేశంలోని టాప్ 500 లిస్టెడ్ కంపెనీల్లో కేవలం 9 మందే మహిళా సీఈవోలు
- ఇదే కంపెనీల్లో 25 మంది మహిళా మేనేజింగ్ డైరెక్టర్లు
- మహిళా డైరెక్టర్లను నియమించని సంస్థలకు రూ.71 లక్షల జరిమానా
- మొత్తం కంపెనీల్లో మాత్రం 11 లక్షల మందికి పైగా మహిళా డైరెక్టర్లు

భారత్‌లోని అగ్రశ్రేణి లిస్టెడ్ కంపెనీల్లో అత్యున్నత కార్యనిర్వాహక పదవుల్లో మహిళల- మిగతా 2 లో

# అసెంబ్లీలో
# రాజకీయ రచ్చ

- ప్రజల సమస్యలు ఎక్కడ?
- ప్రజల ఆశలకు సభలో కనిపించని ప్రాధాన్యం.
- పాలకపక్షం--ప్రతిపక్షం దొందూ దొందేనంటున్న జనం.
- ఆరోపణలు.. ప్రత్యారోపణలు.. వాయిదాలు.. గందరగోళం.
- సాగునీరు, రైతు, నిరుద్యోగం, విద్య, వైద్యంపై సమగ్ర చర్చ ఎక్కడ?
- ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక




- కావాల్సిన సభ..
- రాజకీయ పోరాటానికి వేదికగా మారుతోందా?

2లో

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (వార్త నిర్భయం): తెలంగాణ శాసనసభ సమావేశాలపై ప్రజలు పెట్టుకున్న ఆశలు, సభలో కనిపిస్తున్న రాజకీయ వాతావరణంతో నీరుగారుతున్నాయనే చర్చ రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తోంది. ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు.. ప్రజల సమస్యలపై గళం విప్పి పరిష్కార మార్గాలను సూచించాల్సిన అసెంబ్లీ.. పాలకపక్షం, ప్రతిపక్షాల పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజలకు కావాల్సింది రాజకీయ రచ్చ కాదు.. పరిష్కారం!

రైతుకు సాగునీరు అందుతుందా? నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఎప్పుడు? ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు ఎలా ఉన్నాయి? పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల పరిస్థితి ఏమిటి?

## ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు

### నాణేనికి మరో వైపు చూపిస్తా: జగన్



- ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు
- పార్టీ ప్రజాప్రతినిధులకు జగన్ దిశానిర్దేశం
- శాసనమండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఎమ్మెల్సీలకు సూచన
- ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలపై గళమెత్తాలని ఆదేశం
- ప్రజా సమస్యలను మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళతానన్న జగన్

ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని - మిగతా 2 లో

## ఉప్పాడ తీరంలో సముద్రపు కోతకు చెక్



- ఉప్పాడ తీరానికి రక్షణ కవచం పవన్ సమక్షంలో మద్రాస్ ఐఐటీతో ఒప్పందం
- పవన్ కల్యాణ్ చొరవతో రంగంలోకి మద్రాస్ ఐఐటీ
- రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణం
- డిజైన్, డీపీఆర్, పర్యవేక్షణ బాధ్యతలు చూడనున్న ఐఐటీ-మద్రాస్
- ఈ ఏడాది నవంబర్ నుంచి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు

కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న - మిగతా 2 లో

# నేరాల రూపం
# మారింది పోలీసింగ్ మారాలి

- పోలీసులతో చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్
- నేర దర్యాప్తులో 'గోల్డెన్ అవర్' కీలకమని, ఆధారాల పరిరక్షణలో విఫలం కావొద్దని సూచన
- రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశం
- ఇక నుంచి ప్రతీ నెలా పోలీసుల పనితీరుపై పెర్ఫార్మెన్స్ రిపోర్టు విడుదల
- పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ




మారుతున్న కాలంతో పాటు నేరాల స్వరూపం, స్వభావం పూర్తిగా మారిపోయాయని, అందుకు అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ

మొదటిపేజీ తరువాయి - చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్లు పంపిణీ చేసే సరికొత్త సంక్షేమ పథకాన్ని రేపు అధికారికంగా ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శ్రమను తగ్గించి, వేగంగా పని చేసుకునేందుకు వీలుగా ఈ అధునాతన ఆటోమేటిక్ మిషన్లను అందించబోతున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో వెయ్యి మంది మహిళలకు మిషన్లు అందించబోతున్నారు. లబ్ధిదారుల వయోపరిమితి, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి, అవసరమయ్యే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల వివరాలను మంత్రి రేపు అధికారికంగా వెల్లడిస్తారు. ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించే తేదీలను, ప్రక్రియ మార్గదర్శకాలను ప్రకటించనున్నారు.

## గోదావరి జలాల వినియోగంపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి - నీటి ఎత్తిపోతల (లిఫ్ట్) ప్రక్రియను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నీటిపారుదల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సిఫార్సుల మేరకు ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయడం లేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించగా, ఈ అంశంపై తక్షణమే ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం సూచించారు. దేవాదుల ప్రాజెక్టులో తొమ్మిది పంపుల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం కీలకమని, అక్కడ ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, పెండింగ్ పరిహారం, పునరావాస ప్యాకేజీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు అందజేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లిస్తేనే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులను నింపడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గట్టు, గుడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుపై తగిన అధ్యయనం చేయాలని, గుడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కంపెనీల్లో మహిళా బాస్‌లు చాలా తక్కువ.. పార్లమెంటులో కేంద్రం వెల్లడి

మొదటిపేజీ తరువాయి - ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. టర్నోవర్ ప్రాతిపదికన టాప్ 500 కంపెనీల్లో కేవలం 9 మంది మహిళలు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా (సీఈవో), 25 మంది మేనేజింగ్ డైరెక్టర్లుగా (ఎండీ) బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా సోమవారం లోక్‌సభకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఎంసీఏ21 డేటాబేస్ గణాంకాల ప్రకారం, ఈ 500 కంపెనీల్లో మొత్తంగా 860 మంది మహిళలు బోర్డు సభ్యులుగా, డైరెక్టర్లుగా ఉన్నారు. వీరిలో 738 మంది డైరెక్టర్లు, 67 మంది పూర్తికాల డైరెక్టర్లు, 18 మంది అదనపు డైరెక్టర్లు, 12 మంది నామినీ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే, 22 మంది మహిళలు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లుగా (సీఎఫ్ఓ) బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు మంత్రి వివరించారు. కంపెనీల చట్టం-2013 నిబంధనల ప్రకారం, ప్రతి లిస్టెడ్ కంపెనీ బోర్డులో కనీసం ఒక మహిళా డైరెక్టర్‌ను నియమించడం తప్పనిసరి. ఈ నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత బోర్డు స్థాయిలో మహిళల సంఖ్య పెరిగినప్పటికీ, సీఈవో, ఎండీ వంటి కీలక పదవుల వద్దకు వచ్చేసరికి వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అయితే, మహిళా డైరెక్టర్లు ఉన్నత నాయకత్వ స్థానాలకు ఎదగడానికి ఎదురవుతున్న అడ్డంకులపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి ప్రత్యేక అధ్యయనం నిర్వహించలేదని, కొత్త విధానాలు లేదా ప్రోత్సాహకాలు ఏవీ ప్రస్తుతం పరిశీలనలో లేవని మల్హోత్రా స్పష్టం చేశారు. మరోవైపు, మహిళా డైరెక్టర్లను నియమించడంలో విఫలమైన కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. 2021-22 నుంచి 2025-26 మధ్య కాలంలో నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలకు సంబంధించి మొత్తం 50 ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఆయా సంస్థలపై రూ. 71.01 లక్షల జరిమానా విధించినట్లు మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం క్రియాశీలకంగా ఉన్న మొత్తం కంపెనీల్లో సుమారు 39 లక్షల మంది డైరెక్టర్లు ఉండగా, వారిలో మహిళల సంఖ్య 11.6 లక్షలుగా ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## మహమ్మద్ అలీ జిన్నా.. రాహుల్ గాంధీ రూపంలో మరలా జన్మించారు

మొదటిపేజీ తరువాయి - ధ్వజమెత్తారు. పాకిస్థాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నా, రాహుల్ గాంధీ రూపంలో పునర్జన్మించారని, జిన్నా కంటే కూడా రాహుల్ అత్యంత ప్రమాదకరమైన నాయకుడని బుధవారం ఆయన విమర్శించారు. ఈ మేరకు తన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఝార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో దూబే ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కుంభకోణంపై సీబీఐ విచారణను కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తోందని ఆయన నిలదీశారు. ప్రధాన నిందితుడు ఝార్ఖండ్ ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి నివాసంలో పట్టుబడ్డాడని, ఒకవేళ సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా జరిగితే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు కూడా చిక్కులు తప్పవని ఆరోపించారు. విద్యార్థులకు నిజంగా సంఘీభావం తెలపాలనుకుంటే ఝార్ఖండ్ ప్రభుత్వానికి కాంగ్రెస్ తన మద్దతును వెంటనే ఉపసంహరించుకోవాలని దూబే సవాల్ విసిరారు. లేనిపక్షంలో ఆ పార్టీ జార్జ్ సోరోస్ అజెండాతో పనిచేస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని అన్నారు. ప్రధానికి వ్యతిరేకంగా ఎక్కడ నిరసనలు జరిగినా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షమవుతున్నారని ఆయన మండిపడ్డారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థులు 19 రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, వివాదాస్పద పరీక్షల రద్దు, స్వతంత్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ముట్టడికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్, వాటర్ కేనన్లు, బాష్పవాయువు ప్రయోగించడంతో బీజేపీ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని బీజేపీ పట్టుబడుతుండగా, చర్చల ద్వారా సమస్యను పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది.

## మీరు కొంచెం మారారు: మోదీతో ఖర్గే సరదా వ్యాఖ్య



మొదటిపేజీ తరువాయి - ఎంపీ రాహుల్ గాంధీల మధ్య చోటుచేసుకున్న ఓ సరదా సంభాషణకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే కుమార్తె రేవతి సూలే వివాహ రిసెప్షన్ ఇటీవల ఢిల్లీలో ఘనంగా జరిగింది. శరద్ పవార్ నివాసంలో నిర్వహించిన ఈ వేడుకకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కరచాలనం చేయడంతో పాటు, ప్రియాంక గాంధీని "ఎలా ఉన్నారు?" అని ఆత్మీయంగా పలకరించారు. "నేను బాగున్నాను సర్, మీరు ఎలా ఉన్నారు" అని ప్రియాంక గాంధీ అడగడంతో, నేను ఎప్పటిలాగే ఉన్నాను అని ప్రధాని మోదీ అన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకుంటూ, ప్రధాని మోదీని ఉద్దేశించి "ఆప్ థోడా సా బదల్ గయే హో" (మీరు మునుపటి కంటే కొంచెం మారారు) అని చిరునవ్వుతో వ్యాఖ్యానించారు. దీనికి మోదీ ఆశ్చర్యపోతూ "అవునా?" అని బదులిచ్చి, ఖర్గే భుజంపై చేయి వేసి నవ్వారు. వీరి మధ్య జరిగిన ఈ ఆసక్తికర సంభాషణను చూసి రాహుల్ గాంధీ కూడా నవ్వడం వీడియోలో కనిపిస్తోంది. సుప్రియా సూలే కుమార్తె రేవతి, నాగ్‌పూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త సారాంగ్ లఖానీల వివాహం ఈ ఏడాది జూన్‌లో ముంబైలో జరిగింది. తాజాగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఈ రిసెప్షన్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సోనియా గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్‌ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. రాజకీయంగా తీవ్ర వైరుధ్యాలు ఉన్నప్పటికీ, నేతల మధ్య కనిపించిన ఈ స్నేహపూర్వక వాతావరణం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు

మొదటిపేజీతరువాయి-కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. "గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్‌సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం" అని జగన్ వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలకు సంబంధించి 13 త్రైమాసికాల బకాయిలు పేరుకుపోయాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ అన్నారు. సుమారు రూ. 9,100 కోట్లు, రూ. 3,300 కోట్ల బకాయిలు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ. 2,900 కోట్లు విడుదల చేసిందని విమర్శించారు. ఈ అంశాన్ని మండలిలో లేవనెత్తి చర్చకు పట్టుబట్టాలని ఎమ్మెల్సీలకు సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, పంటలకు నీరందడం లేదని, ఉచిత పంటల బీమా నిలిపివేయడంతో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పీపీపీ ప్రాజెక్టుల పేరుతో ప్రైవేటు సంస్థలకు రాయితీలు కల్పిస్తూ ప్రజలపై భారం మోపుతున్నారని, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణను గట్టిగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. దిశ చట్టం రద్దు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన బీసీ నేతలు చింతడ రవి, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించడం వంటి అంశాలను సభలో ప్రస్తావించాలని ఆయన ఆదేశించారు. జూనియర్ డాక్టర్ల సమ్మె, ఉద్యోగులు, మహిళలు, యువతలో ఉన్న అసంతృప్తిని కూడా మండలిలో ఎత్తిచూపాలని, పూర్తి ఆధారాలతో సభకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## ఉప్పాడ తీరంలో సముద్రపు కోతకు చెక్



మొదటిపేజీ తరువాయి - ఉప్పాడ తీరానికి రక్షణ కవచం పవన్ సమక్షంలో మద్రాస్ ఐఐటీతో ఒప్పందం సముద్ర కోత సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. తీవ్రమైన కోత కారణంగా దెబ్బతింటున్న ఈ తీరాన్ని పరిరక్షించేందుకు ప్రతిష్ఠాత్మక ఐఐటీ మద్రాస్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టు కింద రూ.323 కోట్ల వ్యయంతో ఉప్పాడ తీరంలో రక్షణ గోడ నిర్మించనున్నారు. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్డీఎంఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ఈ పనులకు ఐఐటీ మద్రాస్ సాంకేతిక సారథ్యం వహించనుంది. రక్షణ గోడకు అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) రూపకల్పనతో పాటు, నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను కూడా ఐఐటీ నిపుణులే చూడనున్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్డీఎంఏ) నోడల్ ఏజెన్సీగా, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా వ్యవహరించనున్నాయి. తీర కోత తీవ్రత, సముద్రపు నీటి ప్రవాహాలు, అలల ప్రభావాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసి, ఉప్పాడ తీరానికి అత్యంత అనువైన, పటిష్ఠమైన రక్షణ చర్యలను ఐఐటీ బృందం సూచించనుంది. ఈ ఒప్పందంతో ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రక్రియ పూర్తయినందున, వచ్చే నవంబర్ నుంచి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలు, మత్స్యకారుల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఐఐటీ మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎ.సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఏపీ మారిటైమ్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో రాజకీయ రచ్చ...

మొదటిపేజీ తరువాయి - రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు అసెంబ్లీ వేదికగా సమగ్ర సమాధానాలు రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. అయితే సభలో రాజకీయ అంశాలే చర్చను ఆక్రమిస్తున్నాయనే భావన సామాన్యుల్లో బలపడుతోంది.

### పాలకపక్షం తీరు ఒక వైపు.. ప్రతిపక్షం వ్యూహం మరో వైపు

అధికార పక్షం ప్రభుత్వ విధానాలను సమర్థించుకోవడంతో పాటు ప్రతిపక్ష విమర్శలను తిప్పికొట్టడానికే ప్రాధాన్యం ఇస్తోందనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రజా సమస్యలను రాజకీయ అస్త్రాలుగా మలుచుకుంటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రశ్న ఒక్కటే---ఇద్దరి రాజకీయ పోరాటంలో ప్రజల సమస్యల పరిస్థితి ఏమిటి?

ప్రజా సమస్యలను లేవనెత్తడం ప్రతిపక్షం బాధ్యత అయితే.. వాటికి సమాధానం చెప్పడం, పరిష్కార మార్గాలను చూపడం ప్రభుత్వ బాధ్యత. కానీ ఇరుపక్షాలు తమ రాజకీయ వాదనలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే అసెంబ్లీ అసలు ఉద్దేశమే దెబ్బతింటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### వాయిదాలతో సమస్యలు పరిష్కారమవుతాయా?

సభలో గందరగోళం, నిరసనలు, పరస్పర ఆరోపణలు చోటుచేసుకోవడం వల్ల చర్చకు దక్కాల్సిన సమయం తగ్గిపోతే చివరకు నష్టపోయేది రాజకీయ పార్టీలు కాదు.. ప్రజలేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. రైతు సమస్యపై సభలో చర్చ జరిగితే రైతుకు భరోసా కలుగుతుంది. నిరుద్యోగంపై చర్చ జరిగితే యువతకు ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తుంది. విద్య, వైద్యంపై చర్చ జరిగితే ప్రజలకు జవాబుదారీతనం పెరుగుతుంది. సాగునీటిపై చర్చ జరిగితే ప్రాజెక్టుల పురోగతిపై సమాధానాలు కోరే అవకాశం ఉంటుంది. అయితే ఈ అసలు ప్రశ్నలన్నింటికంటే రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం పెరిగితే.. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందా?

### అసెంబ్లీ ఎవరి కోసం?

అసెంబ్లీ అధికార పార్టీ కోసం కాదు.. ప్రతిపక్షం కోసం కాదు.. ప్రజల కోసం. ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వెళ్లి హామీలు ఇచ్చే రాజకీయ పార్టీలు, సభలో ప్రజల సమస్యలను చర్చించే సమయంలో మాత్రం పరస్పర రాజకీయ పోరాటాలకు పరిమితం కాకూడదనే డిమాండ్ వినిపిస్తోంది. ప్రజా సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ప్రభుత్వాన్ని ప్రతిపక్షం ప్రశ్నించాలి. ప్రతిపక్షాన్ని ప్రభుత్వం సమాధానాలతో ఎదుర్కోవాలి. కానీ సభా సమయం మొత్తం రాజకీయ రగడలోనే గడిచిపోతే.. ప్రజల గొంతు వినిపించేది ఎక్కడ?

### ఇప్పటికైనా తీరు మారాలి

పాలకపక్షం, ప్రతిపక్షం రెండూ తమ రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ప్రజా సమస్యలను ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉంది. సభలో ఎంత గట్టిగా రాజకీయ విమర్శలు చేశామన్నది కాదు.. ఎన్ని ప్రజా సమస్యలకు పరిష్కారం చూపించామన్నదే ప్రజాస్వామ్యానికి అసలైన కొలమానం. ప్రజలు అడుగుతున్నది పదవుల కోసం పోరాటం కాదు.. తమ సమస్యలకు పరిష్కారం. ప్రజలు కోరుతున్నది రాజకీయ రచ్చ కాదు.. ప్రజా చర్చ. అసెంబ్లీ కోరుతున్నది అధికార--ప్రతిపక్ష పోరు కాదు.. ప్రజల గొంతుక కావాలి. ఇప్పటికైనా పాలక, ప్రతిపక్షాలు రాజకీయ ప్రతిష్టంభనకు తెరదించి, సభా సమయాన్ని పూర్తిగా ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు. చివరికి నిలిచేది ఎవరి రాజకీయ వాదన అన్నది కాదు.. ప్రజల సమస్యకు పరిష్కారం దొరికిందా లేదా అన్నదే.

## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు

మొదటిపేజీ తరువాయి - వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం ఈ అంశంపై 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ స్పందించారు. "తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా ఉద్యోగులతో కూడిన స్కామ్.. అదేనండీ స్కీమ్ అయిన 'అనుముల హబ్స్' సృష్టిస్తున్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని 'శతాబ్దపు ఆవిష్కర్త'గా ప్రకటించాలి" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. కేవలం రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు. టెస్సారక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెస్సారక్ట్ ఛైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన జీవో, భూమి విలువ, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు వంటి అన్ని పత్రాలను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూ కేటాయింపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, దీనిపై ముందుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులను శిక్షించే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు.

## ఇమ్రాన్ ఖాన్ చనిపోయారా? పాక్ జర్నలిస్టు సంచలన వ్యాఖ్యలు.. నిజమెంత?



మొదటిపేజీ తరువాయి - అమెరికాలో ఉంటున్న జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ ఓ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇమ్రాన్ ఖాన్ ఇప్పుడు జీవించి లేరని ముగ్గురు సీనియర్ పాకిస్థాన్ సైనిక అధికారులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే వాళ్లు కూడా ఈ సమాచారాన్ని స్వయంగా నిర్ధారించలేదని చెప్పారు. అనధికారిక మార్గాల్లో తమకు సమాచారం అందిందని మాత్రమే వారు చెప్పినట్లు వివరించారు. 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. ఆయనపై పలు కేసులు కొనసాగుతున్నాయి. జైల్లో ఉన్న ఆయన్ను కలిసేందుకు కుటుంబ సభ్యులకు అనుమతి ఇవ్వడం లేదంటూ పాకిస్థాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ పలుసార్లు ఆరోపించింది. ఆయనకు సరైన వైద్యం అందడం లేదని కూడా పార్టీ నేతలు చెబుతున్నారు. ఇమ్రాన్ కుటుంబ సభ్యులు, పీటీఐ నేతలు మంగళవారం మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వకపోతే సెప్టెంబర్ 27న ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ చేపడతామని పీటీఐ ప్రకటించింది. అంతకుముందే నిరసనలు చేపడతామని హెచ్చరించింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై అమెరికా నుంచి కూడా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. 13 మంది అమెరికా చట్టసభ సభ్యులు అక్కడి విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు లేఖ రాశారు. ఇమ్రాన్, ఆయన భార్య బుష్రా బీబీ నిర్బంధ పరిస్థితులపై ఇస్లామాబాద్‌తో మాట్లాడాలని కోరారు.

## 26 ఏళ్ల తర్వాత బట్టబయలైన క్లింటన్ రహస్యం.. అధ్యక్షుల డెకాయ్ విమానాల కథ!

మొదటిపేజీ తరువాయి - భద్రతా కారణాల దృష్ట్యా అసలు విమానానికి బదులుగా ఒక డెకాయ్ (మాయ) విమానాన్ని వాడారని, ఈ విషయాన్ని ప్రభుత్వం జర్నలిస్టులకు ముందుగానే తెలిపిందని ఓ సీనియర్ వైట్ హౌస్ జర్నలిస్ట్ వెల్లడించారు. ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తుర్కియే పర్యటనలో ఇలాంటి వ్యూహాన్నే అనుసరించారన్న వార్తల నేపథ్యంలో ఈ పాత ఘటన ప్రాధాన్యత సంతరించుకుంది. 'ది వాషింగ్టన్ పోస్ట్' కథనం ప్రకారం.. యూఎస్ఏ టుడే వాషింగ్టన్ బ్యూరో చీఫ్ అయిన సూసన్ పేజ్ ఈ విషయాన్ని బయటపెట్టారు. 2000 సంవత్సరంలో ఆమె వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఉన్నారు. క్లింటన్ భారత్ నుంచి పాకిస్థాన్‌కు వెళ్లే ముందు, వైట్ హౌస్ అధికారులు తనను ఆఫ్-ది-రికార్డ్ సమావేశానికి పిలిచారని ఆమె తెలిపారు. "పాకిస్థాన్‌కు వెళ్లడంలో ఉన్న ప్రమాదాల కారణంగా తీసుకుంటున్న అసాధారణ భద్రతా చర్యల గురించి వారు నాకు వివరించారు. అందులో డెకాయ్ విమానాన్ని ఉపయోగించడం కూడా ఒకటి. ఆ ముప్పు కేవలం క్లింటన్‌కే కాదు, పర్యటనను కవర్ చేస్తున్న జర్నలిస్టులకు కూడా ఉందని చెప్పారు" అని సూసన్ పేజ్ పేర్కొన్నారు.

క్లింటన్, ట్రంప్ వ్యూహాల్లో తేడా 2000 మార్చిలో ఇస్లామాబాద్‌లో ఎయిర్ ఫోర్స్ వన్ తరహా విమానం ఒకటి ల్యాండ్ అయింది. అందులో నుంచి క్లింటన్‌ను పోలిన ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ బయటకు వచ్చారు. మీడియా దృష్టి అటువైపు మళ్లిన తర్వాత, గుర్తు తెలియని మరో విమానం ల్యాండ్ కాగా, దాని నుంచి అసలైన అధ్యక్షుడు క్లింటన్ దిగారు. అయితే, ఈ వ్యూహం గురించి జర్నలిస్టుల ప్రతినిధికి ముందుగానే సమాచారం ఇచ్చారు. కానీ, గత నెలలో తుర్కియే నుంచి వెళుతున్నప్పుడు ట్రంప్ విషయంలో భిన్నంగా జరిగింది. ఇరాన్ నుంచి విశ్వసనీయమైన ముప్పు ఉందన్న సమాచారంతో ట్రంప్‌ను రహస్యంగా ఎయిర్‌పోర్ట్ క్యాటరింగ్ ట్రక్కులో ఎక్కించి, గుర్తు తెలియని సి-32ఏ విమానంలోకి మార్చారు. అసలైన అధ్యక్ష విమానం మాత్రం జర్నలిస్టులు, కొందరు సిబ్బందితో డెకాయ్‌గా ప్రయాణించింది. ఈ మార్పు గురించి జర్నలిస్టులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, కిటికీ షేడ్లు మూసివేయమని మాత్రమే ఆదేశించినట్లు 'ది వాషింగ్టన్ పోస్ట్' తెలిపింది. అధికారుల స్పందన ఈ ఘటనపై వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చుంగ్ స్పందిస్తూ.. "అధ్యక్షుడి ప్రాణాలకు ముప్పు తలపెట్టే శత్రువులు అమెరికాకు చాలా మంది ఉన్నారు. ఆ ముప్పులను ఎదుర్కోవడానికి మా వద్ద ఉన్న అన్ని మార్గాలను ఉపయోగిస్తాం" అని భద్రతా చర్యలను సమర్థించుకున్నారు. అయితే, డెకాయ్ విమానం గురించి నేరుగా ప్రస్తావించలేదు. దాదాపు రెండున్నర దశాబ్దాలు గడిచిపోవడం, అప్పట్లోనే క్లింటన్ దిగినప్పుడు ఈ వ్యూహం అందరికీ తెలిసిపోవడంతో ఇప్పుడు ఈ విషయాన్ని వెల్లడించడంలో తప్పులేదని భావించినట్లు సూసన్ పేజ్ తెలిపారు. అధ్యక్షుడి కదలికలపై స్వతంత్రంగా నివేదించే వైట్ హౌస్ ప్రెస్ పూల్ విషయంలో క్లింటన్, ట్రంప్ యంత్రాంగాలు అనుసరించిన భిన్నమైన పద్ధతులను ఈ రెండు ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

## సర్పంచ్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో

# చేతిపంపులకు మరమ్మతులు



**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ(పినపాక నియోజకవర్గం ప్రతినిధి వల్లెపోగు రాము)అశ్వాపురం సెప్టెంబర్ 11:–** అశ్వాపురం మండలం గొందిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సనపవాల బజారు,గొందిగూడెం గనిబోయిన శివ కిరాణా షాపు వద్ద ఉన్న రెండు చేతిపంపులు పాడవడంతో గ్రామ ప్రజలు ఎదురుకుంటున్న నీటి సమస్య గురించి తెలుసుకొని వెంటనే స్పందించిన గొందిగూడెం సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి, చేతిపంపులు మరమ్మతులు చేసే సిబ్బందిని పిలిపించి, అవసరమైన సామగ్రిని వెంటనే తెప్పించి రెండు చేతిపంపులకు కొత్త పైపులు వేసి మరమ్మతులు చేయించడం జరిగింది, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు మళ్ళీ పునరావృతం కాకుండా,గ్రామ ప్రజలకు తాగునీటి కొరత లేకుండా తక్షణ చర్యలు తీసుకోవడం జరిగింది. కార్యక్రమంలో గొందిగూడెం గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నరు.

## అధికార పార్టీకి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను చూస్తే భయమేస్తుంది నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెన్న అశోక్ కుమార్




**భద్రాద్రి కొత్తగూడెం పోరు తెలంగాణ(పినపాక నియోజకవర్గ ప్రతినిధి వల్లెపోగు రాము) అశ్వాపురం సెప్టెంబర్ 11:–** తెలంగాణ రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తుందని పినపాక నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెన్న అశోక్ కుమార్ అన్నారు అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న ఎమ్మెల్యేలను అడ్డుకోవడమే కాకుండా దళితుడైన స్పీకర్ ను తాతా మధు అవమానించాడని ఒక నెపం వేసి మా ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయించారు ఎందుకంటే అసెంబ్లీలో ఉంటే కేటీఆర్,హరీష్ రావును తట్టుకునే దమ్ము లేక పరిపాలనలో ఏం చేశారని నిలదీస్తే సమాధానం చెప్పలేక అసెంబ్లీ నుండి పథకం ప్రకారమే సస్పెండ్ చేయడం జరిగింది నిజంగా దమ్ము ధైర్యం ఉంటే మీరు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీలు ఎన్ని నెరవేర్చారు చర్చకు సిద్ధం కావాలి కానీ పిరికి పందాలాగా పారిపోవటం ఏమిటని నిలదీస్తున్నాను దళితుడు దళితుడు అంటున్నారు కదా ఒక దళిత నాయకుడు భట్టి విక్రమార్కాను కాదని ఒక అగ్రకుల వ్యక్తికి ఐదు పార్టీలు మారిన మనిషిని ముఖ్యమంత్రి పీఠం ఎందుకు ఎక్కించారు దీనికి సమాధానం చెప్పాలి ఎందుకు చేతకాని రాజకీయాలు చేస్తారు ఎవరైనా సరే ప్రజల మేలుకోరి రాజకీయాలు చేయండి కానీ మభ్య పెట్టవద్దని హెచ్చరించడం జరుగుతుంది.

# ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెల ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన ఆగమన ఫ్రెషర్స్ డే వేడుకలు కళాశాల ప్రిన్సిపల్ చకిలం అమరేందర్ అధ్యక్షతన, విద్యార్థుల నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల తో నిర్వహించిన సంబరాలు అంబరన్నాంటాయి. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని విద్యార్థులు కళాశాలలో ఉన్న వసతులు అధ్యాపకుల బోధన వారి అనుభవాలు తెలుపుతూ ఆనందపడ్డారు. విద్యార్థులను ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ ప్రభుత్వ కళాశాల మీద నమ్మకంతో కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులను అభినందిస్తూ ప్రభుత్వం అందజేస్తున్నటువంటి నాణ్యమైన విద్య,నిష్ణాతులైన అధ్యాపకుల బోధన ప్రభుత్వ కళాశాలలోనే సాధ్యమని తెలుపుతూ ప్రతి విద్యార్థి చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు ఆఫీస్ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ పోషణ మాసం కార్యక్రమం





**పోరు తెలంగాణ ప్రతినిధి//మెట్ పల్లి :** ఈ నెల 9 నుండి అక్టోబర్ 9 వరకు జాతీయ పోషణ మాసం కార్యక్రమం ప్రతి అంగన్వాడీలో నిర్వహించాలని ఉన్నందున ఈ రోజు మెట్టుపల్లి పట్టణంలోని 9వ వార్డు అంగన్వాడి కేంద్రంలో జాతీయ పోషణ మాస కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెట్పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఏ సి డి పి ఓ కేసరి, మరియు వార్డ్ మెంబర్ బొడ్ల వసుధ, నాగేష్ , పాల్గొని తల్లులకు గర్భిణీలకు, పిల్లలకు వార్డ్ ప్రజలకు పోషణ మాసం గురించి తెలియజేస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని కూరగాయలు పండ్లు పప్పు ధాన్యాలు పాలు గుడ్లు మరియు ఇతర పోషక పదార్థాలు వివిధ ఆహార పదార్థాల ద్వారా లభించే పోషక తత్వాలు మన శరీరానికి ఎంతో అవసరమని ఏ సి డి పి ఓ కేసరి తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సేమిమ్ సుల్తానా, ఏడో వాడు ఎనిమిదో వార్డ్ 14వ వార్డు 23 వ వార్డు అంగన్వాడి టీచర్లు ఆయామ్మలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జాతీయ మహిళా కమిషన్ కు ఎమ్మెల్యేలు ఫిర్యాదు



**మహేశ్వరం, సెప్టెంబర్ 11, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** అసెంబ్లీ ప్రాంగణం వద్ద మహిళ ఎమ్మెల్యేలను పోలీసుల చేత అవమానించడంతో శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహట్కర్ కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ వద్ద జరిగిన తీరును ఎమ్మెల్యేల బృందం కమిషన్ చైర్ పర్సన్ కు వివరించారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకొని తమ హక్కులకు విఘాతం కలిగించిన వారిపై శాఖ పరంగా తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్, వాణిదేవి, జగదీష్ రెడ్డి, పల్లారాజేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్

పాత రికార్డులు, మ్యాపుల ఆధారంగా భూ సరిహద్దుల కచ్చితమైన నిర్ధారణ

సీఎస్ఆర్ నిధులతో రహదారి నిర్మాణానికి చర్యలు





**భద్రాద్రి కొత్తగూడెం, పోరు తెలంగాణ(పినపాక నియోజకవర్గం ప్రతినిధి వల్లెపోగు రాము) అశ్వాపురం సెప్టెంబర్ 11:–** భూ రీ సర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి భూ సరిహద్దులను కచ్చితంగా నిర్ధారిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్, ట్యాబ్ పరికరాలతో చేపడుతున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. డిజిటల్ విధానంలో సర్వే నిర్వహించడం వల్ల సమయం, సిబ్బంది ఆదా కావడంతో పాటు ట్యాబ్‌లో నమోదైన సమాచారాన్ని నేరుగా కంప్యూటర్, ఆటోక్యాడ్‌లోకి మార్చుకునే అవకాశం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అమ్మగారిపల్లి, కుమ్మగూడెం పరిధిలో కాడస్ట్రల్ మ్యాపులు, పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా సుమారు 1,900 ఎకరాలకు పైగా భూముల సరిహద్దులను నిర్ధారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 1920ల నాటి ఫసలీ రికార్డులతో పాటు బూర్గంపాడు తాలూకాకు సంబంధించిన పాత రికార్డులను పరిశీలిస్తున్నట్లు వివరించారు. మూడు తరాలుగా భూములను అనుభవిస్తున్నప్పటికీ రికార్డుల్లో ఉపవిభజనలు నమోదు కాకపోవడం వల్ల ఎదురవుతున్న సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గోదావరి వరదలు, భూమి కోతల కారణంగా కొన్ని ప్రాంతాల్లో పాత భూ సరిహద్దులు మారిపోయాయని, సీతారామ ప్రాజెక్టు పరిసరాల్లో కొన్ని చోట్ల సుమారు 250 మీటర్ల మేర మార్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు వివరించారు. 57/1 తదితర సర్వే నంబర్లలో నీట మునక, ఇసుక మేటల కారణంగా పాత భూ గుర్తులు కనుమరుగైనట్లు తెలిపారు. కేఎంఎల్ ఫైళ్ల ఆధారంగా సుమారు 7.91 కిలోమీటర్ల మేర సరిహద్దులను గుర్తిస్తున్నామని, రోజుకు సుమారు 2 కిలోమీటర్ల చొప్పున సర్వే నిర్వహించి 2 నుంచి 4 రోజుల్లో పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. పాత రికార్డులను సమగ్రంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు భూములపై స్పష్టత కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ప్రాంతంలో రహదారి నిర్మించాలని కలెక్టర్‌ను కోరగా, అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ సీఎస్ఆర్ నిధులతో అవసరమైన మేరకు రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్, సర్వే అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లిపాక ప్రాథమిక పాఠశాలకు ఐటీసీ చేయూత విద్యార్థులకు బెంచీల పంపిణీ!

సర్పంచ్ ముంద్రు వెంకట రామకృష్ణ చేతుల మీదుగా బల్లల అందజేత

గ్రామాభివృద్ధి, ఉన్నత పాఠశాలకు సహకరించిన ఐటీసీ అధికారులకు ఘన సన్మానం




**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ(పినపాక నియోజకవర్గం ప్రతినిధి వల్లెపోగు రాము) అశ్వాపురం, సెప్టెంబర్ 11 :–** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రముఖ పారిశ్రామిక సంస్థ ఐటీసీ అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని నెల్లిపాక గ్రామ పంచాయతీ సర్పంచ్ ముంద్రు వెంకట రామకృష్ణ కొనియాడారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత లో భాగంగా అశ్వాపురం మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ పంచాయతీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఐటీసీ సంస్థ సమకూర్చిన డ్యూయల్ డెస్క్ బెంచీలను శుక్రవారం ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ?గతంలో నెల్లిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామ సమగ్ర అభివృద్ధికి ఐటీసీ యాజమాన్యం విశేష సహకారం అందించింది. ఈ నేపథ్యంలో విద్యారంగానికి, గ్రామానికి చేస్తున్న సేవలను గుర్తిస్తూ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు కలిసి ఐటీసీ డీజీఎం డి. చెంగల్‌రావు, మేనేజర్ బి. విశ్వనాథంలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు కూర్చునేందుకు సరైన బల్లలు సమకూరడం వల్ల విద్యాభ్యాసానికి ఎంతో మేలు జరుగుతుందని, దాతలు, పరిశ్రమలు ఇలాంటి సేవా కార్యక్రమాలతో ముందుకు రావడం శుభపరిణామమని వక్తలు పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు అమరపురి శివానంద, ఏఎంసీ డైరెక్టర్ కుర్రి భువనసంతోష్, మాజీ సర్పంచ్ గొర్రెముచ్చు వెంకటరమణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు, చంచల్లు బలరాం తదితరులు పాల్గొన్నారు.

# జమిందారి జాగిర్దారి దోపిడీ నుండి విముక్తి పొంది భారత దేశంలో విలీనమైన రోజు సెప్టెంబర్ 17 బీజేపీ పట్టణ అధ్యక్షులు ధోనికెలనవీన్

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ఎమ్మార్వో కార్యాలయం ముందు మహాధర్న నిర్వహించిన బిజెపి శ్రేణులు...





**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్ పల్లి :** సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, నిజాం నిరంకుశ పాలనపై సాగిన చారిత్రక పోరాట చరిత్రను భావితరాలకు అందించాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మెట్పల్లి పట్టణ అధ్యక్షులు దొనికెల నవీన్ ఎమ్మార్వో కార్యాలయం ముందు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్ చేస్తూ మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్పల్లి బిజెపి పట్టణ అధ్యక్షులు ధోనికెల నవీన్ మాట్లాడుతూ... 1948 సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దురాగతాలు,జమీందారీ–జాగిర్దారీ దోపిడీ నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొంది భారతదేశంలో విలీనమైందని, ఆ మహోన్నత చారిత్రక దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపాలని కోరారు. ఈ విమోచన కోసం అప్పట్లో అనేకమంది రైతులు, మహిళలు, యువకులు, సామాన్య ప్రజలు పోరాడి ప్రాణత్యాగాలు చేశారని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చూపిన రాజకీయ సంకల్పం, భారత సైన్యం నిర్వహించిన 'ఆపరేషన్ పోలో' ఈ చారిత్రక పరిణామంలో కీలక పాత్ర పోషించాయని ధోనికెలనవీన్ గుర్తుచేశారు. అమరవీరుల త్యాగాలను గౌరవిస్తూ, జాతీయ సమైక్యతను బలోపేతం చేయడానికి బీజేపీ తరపున "తెలంగాణ సప్త సంకల్పాలు" ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్ విమోచనలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు హైదరాబాద్‌లో భారీ ఎత్తున "స్టాట్యూ ఆఫ్ లిబరేషన్ – తెలంగాణ" నిర్మించాలిఅని డిమాండ్ చేశారు. విమోచన మ్యూజియం ఏర్పాట హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో "హైదరాబాద్–తెలంగాణ విమోచన మ్యూజియం"ను ఏర్పాటు చేసి, నాటి చారిత్రక ఆధారాలను పరిరక్షించాల ని కోరారు. ప్రతి జిల్లా కేంద్రంలో "తెలంగాణ విమోచన స్మృతి కేంద్రం" ఏర్పాటు చేసి, స్థానిక వీరుల,అమరవీరుల చరిత్రను నమోదు చేయాలని,పాఠ్యపుస్తకాల్లో చరిత్ర నిజాం పాలన, రజాకార్ల దురాగతాలు, పోరాట చరిత్రను పాఠశాల, కళాశాల పాఠ్యపుస్తకాల్లో చేర్చడంతో పాటు, అజ్ఞాత వీరుల అధికారిక జాబితాను రూపొందించాల ని డిమాండ్ చేశారు. స్మారక స్తూపాలు రజాకార్ల దురాగతాలకు గురైన బైరాన్పల్లి, పరకాల వంటి చారిత్రక ప్రాంతాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అలాంటి గ్రామాలను గుర్తించి స్మారక స్తూపాలు నిర్మించాలని అన్నారు. పర్యాటక సర్క్యూట్ తెలంగాణ విమోచన పోరాట కేంద్రాలు, అమరవీరుల స్థలాలను అనుసంధానిస్తూ "తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్"ను అభివృద్ధి చేయాలి. ఈ సప్త సంకల్పాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళు_న్నామని దొనికెల నవీన్ స్పష్టం చేశారు.

# తుర్రంవారిగూడెంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం




**భద్రాద్రి కొత్తగూడెం, పోరు తెలంగాణ(పినపాక నియోజకవర్గం ప్రతినిధి వల్లెపోగు రాము) అశ్వాపురం సెప్టెంబర్ 11:–** అశ్వాపురం మండలంలోని తుర్రంవారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని తురుమలగూడెం తండా అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తురుమలగూడెం తండా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి సీడీపీఓ తార హాజరై పోషణ మాసం ప్రాధాన్యతను వివరించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని,గర్భిణులు, బాలింతలు కూడా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. కుటుంబాల్లో పోషకాహారంపై అవగాహన పెంచడంతో పాటు పిల్లలకు సమతుల్య ఆహారం అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సూపర్వైజర్లు స్వప్న, ధనలక్ష్మి, సావిత్రి మాట్లాడుతూ పోషణ మాసం సందర్భంగా గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, చిన్నారుల ఆరోగ్యం, బరువు, ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గ్రామ సర్పంచ్ కుంజా జాను, ఉపసర్పంచ్ ధరావత్ హర్ష నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి చిన్నారుల పోషణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. పోషకాహార లోపం వల్ల కలిగే సమస్యలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోషణ మాసం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంగన్వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని వారు కోరారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్ తరాలను తీర్చిదిద్దవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండలంలోని పలువురు అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు..

## గొల్లవాగు ప్రాజెక్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, సెప్టెంబర్ 11 :** భీమారం గొల్లవాగు ప్రాజెక్ట్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. సదరు మృతదేహానికి సంబంధించిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు లేదా మృతుడిని గుర్తించిన వారు భీమారం పోలీస్ స్టేషన్ ఎస్సై ఎ. రాజేందర్ లేదా జైపూర్ సీఐ నవీన్ కుమార్ కి సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 8712656552 , 8712656549 మృతుడి కుటుంబ సభ్యులు లేదా బంధువులు గుర్తించినట్లయితే పై నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

## భీమారం లో విద్యుత్ సరఫరాకు అంతరాయం: ఏఈ శంకర్



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, సెప్టెంబర్ 11 :** భీమారం 33/11 కేవీ సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా 12/09/2026 శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బి. శంకర్ తెలిపారు. భీమారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఈ సమయంలో సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# రాజ్యాంగ విలువలను కాపాడాలి

అంబేద్కర్‌ను అవమానించే ప్రచారాలను అడ్డుకోవాలి: దాసరి రమేష్

సామాజిక మత సామరస్యాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 11(పోరు తెలంగాణ (ప్రతినిధి,జివిరత్నం) :** భారత రాజ్యాంగం దేశంలోని భిన్న కులాలు, మతాలు, భాషలు, ప్రాంతాలు, సంస్కృతులను ఏకతాటిపై నడిపిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తోందని తెలంగాణ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ ఫర్ మాల (టి ఈ ఏ ఎం) కన్వీనర్ దాసరి రమేష్ అన్నారు. రాజ్యాంగ విలువలను, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాలను ప్రజలు, ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నాటి నుంచి అనేక భిన్నత్వాల మధ్య దేశం ఐక్యంగా కొనసాగడానికి రాజ్యాంగమే ప్రధాన ఆధారమన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో అంతర్గత ఘర్షణలు, యుద్ధాలు చోటుచేసుకుంటున్నప్పటికీ, భారత్‌లో వివిధ కులాలు, మతాలు, భాషలు, ప్రాంతాలకు చెందిన ప్రజలు కలిసి జీవించడానికి రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య, సమానత్వ స్ఫూర్తి ఎంతో కీలకమని పేర్కొన్నారు.

**అంబేద్కర్‌పై అవాస్తవ ప్రచారం ఆపాలి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను కించపరిచేలా, ఆయన చారిత్రక పాత్రను ప్రశ్నించేలా కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారని దాసరి రమేష్ ఆరోపించారు. అంబేద్కర్‌ను కేవలం ఒక సామాజిక వర్గానికి పరిమితం చేయకుండా, భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను దేశ ప్రజలు గుర్తించాలని అన్నారు. "అంబేద్కర్ గారి చారిత్రక పాత్రను వక్రీకరించే ప్రయత్నాలు సమాజంలో అనవసరమైన విభేదాలకు దారితీసే ప్రమాదం ఉంది. ఇలాంటి అంశాలపై వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలి" అని ఆయన పేర్కొన్నారు.

**'హమారా పబ్లికేషన్స్', పుస్తక ప్రచారంపై ప్రశ్నలు**

హమారా ప్రసాద్ పేరుతో జరుగుతున్న కొన్ని ప్రచారాలు, 'అంబేద్కర్ కల్పిత నాయకుడు' పేరుతో పుస్తక ప్రచురణకు సంబంధించిన అంశాలపై కూడా దాసరి రమేష్ పలు ప్రశ్నలు లేవనెత్తారు. పుస్తక ప్రచురణ, సంస్థ రిజిస్ట్రేషన్, ఐ ఎస్ బీ ఎన్, నిధుల సేకరణ తదితర అంశాలపై సంబంధిత అధికారులు వాస్తవాలను పరిశీలించాలని కోరారు. అలాగే పుస్తక ముద్రణ కోసం విరాళాలు కోరుతూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కూడా పారదర్శకత అవసరమని ఆయన అన్నారు. పుస్తకానికి సంబంధించిన ఖర్చులు, విరాళాల వివరాలు, విక్రయాల వివరాలను బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**సామాజిక మాధ్యమాలపై నిఘా అవసరం**

కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు, పోస్టులు, ప్రచారాలు చేయడం వల్ల సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని దాసరి రమేష్ అన్నారు. సోషల్ మీడియా వేదికగా వచ్చే అభ్యంతరకర ప్రచారాలపై చట్టపరంగా పరిశీలించి, తప్పు జరిగితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు భారతదేశంలో ఇప్పటివరకు వివిధ మతాలు, కులాలు, ప్రాంతాలకు చెందిన ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవిస్తున్నారని, ఈ సామాజిక ఐక్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

**"రాజ్యాంగాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత"**

దేశ ఐక్యత, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలకు భారత రాజ్యాంగం పునాది అని దాసరి రమేష్ పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతల కృషిని గౌరవిస్తూ, చారిత్రక వ్యక్తులపై విమర్శలు ఉన్నా అవి వాస్తవాలు, ఆధారాలతోనే ఉండాలని సూచించారు. "వ్యక్తుల మధ్య విభేదాలు ఉన్నా.. దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక సామరస్యాన్ని కాపాడటంలో అందరూ భాగస్వాములు కావాలి. కుల, మత విభేదాలను రెచ్చగొట్టే ప్రచారాలకు దూరంగా ఉండాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు.

జై భీమ్ ?

వర్ధిల్లాలి భారత రాజ్యాంగం ?

## రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరించినలి

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల .

కొత్తగూడెం పొంగులేటి క్యాంపు కార్యాలయం లో ,

డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న తో కలసి ప్రెస్ మీట్‌లో పాల్గొన్న కొత్వాలలి .





**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 11(పోరు తెలంగాణ (ప్రతినిధి,జివిరత్నం):** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ మద్ది శ్రీనివాస రెడ్డి ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. కొత్తగూడెం నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జిగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం వచ్చిన సందర్భంగా విద్యానగర్‌లోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మీడియా సమావేశంలో మద్ది శ్రీనివాసరెడ్డి , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న తో పాటు కొత్వాల, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై కేవలం దళితుడనే ఉద్దేశ్యంతో ఉద్దేశ్య పూర్వకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు మరో ఎమ్మెల్సీ లు అనుచిత వ్యాఖ్యలు చేశారని, వారిని వెంటనే పదవి నుండి బర్తరఫ్ చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులకు దళితులంటే ఏహ్యాభావన ఉందని, దళితులను తక్కువగా చూడటం పరిపాటి అయిందన్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అశ్వాపురం మండల స్థాయి సమీక్షా సమావేశం






**భద్రాద్రి కొత్తగూడెం పోరు తెలంగాణ(పినపాక నియోజకవర్గ (ప్రతినిధి వల్లెపోగు రాము) అశ్వాపురం, సెప్టెంబర్ 11:-** మండల కేంద్రంలో రైతువేదిక లో శు క్రవారం ఎంపీడీఓ ముత్యాలరావు ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్,అశ్వాపురం మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి యస్. చందన అధ్యక్షతన హాజరయ్యారు. ఈ సమావేశం లో గ్రామ పంచాయతీల సర్పంచ్లు మరియు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో.....

1. అశ్వాపురం పంచాయతీ పరిధిలో 15 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, అలాగే గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని బాణోత్ సదర్ లాల్ గారు కోరారు.
2. చింత్రియాల, చింత్రియాల కాలనీ గ్రామ పంచాయతీలకు అంగన్వాడీ బిల్డింగ్ మంజూరు చేయగలరు ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్లు కోరారు.
3. తుర్రంవారి గూడెం, యాలకలగూడెం, గొందిగూడెం కొత్తూరు, మనుబోతులపాడు, బట్టీలగుంపు గ్రామ పంచాయతీల భవనాలు పూర్తి చేయవసినదిగా సర్పంచులు సమీక్షా సమావేశం కోరినారు.

ఎంపీడీవో సూచనలు :-

సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీడీవో ముత్యాలరావు మాట్లాడుతూ.. అశ్వాపురం మండలంలో ఉన్న ప్రతి ఇంటికీ వీబీజీ రాంజీ పథకం ద్వారా ఇంకుడు గుంతలను (Soak Pits) నిర్మించుకోవాలని మరియు ఈ నెల 15 తారీకు చేయుత పెన్షన్లకు లాస్ట్ డేట్ ఉన్నందున పెన్షన్ కి అప్లై చేసుకోని వారు ఉంటే అప్లై చేసుకోగలరని సూచించారు. అశ్వాపురం మండల స్పెషల్ ఆఫీసర్ చందన మాట్లాడుతూ ప్రతి 45 రోజులకు ఒకసారి జరిగే ఈ మండల స్థాయి సమీక్షా సమావేశంలో సర్పంచులు మరియు అధికారులను తమ తమ గ్రామ పంచాయతీల్లో ఉన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ యొక్క కార్యక్రమంలో స్థానిక సర్పంచులు,మండల స్థాయి అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్య సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీల ధర్మ పోరాట దీక్షల సందర్భంగా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందించిన జాతీయ బి.సి సంక్షేమ సంఘం నాయకులు



**పోరు తెలంగాణ ఖమ్మం (సెప్టెంబర్ 11) :** దేశవ్యాప్తంగా జరిగే జాతి జనగణలో బీసీ కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 1-5- 2025 న నిర్ణయం తీసుకొని ప్రకటించింది.కానీ ఇప్పుడు కులగణన శాస్త్రీయమైన పద్ధతిలో చేయకుండా, ఓబీసీ కుటుంబాలను లెక్కించకుండా, బీసీ కాలం లేకుండా, ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ లేకుండా బీసీలకు అన్యాయం చేస్తుంది, రెండవసారి అప్పుడే జాతీయ జన గణన ఆగస్టు 17వ తేదీ నుండి ప్రారంభం మొదలుపెట్టింది బీసీలను మోసం చేసే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని, నయవంచను వ్యతిరేకిస్తూ ఈనెల 11 వ తేదీన (శుక్రవారం) రోజున తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, కేంద్రాల్లోబీసీల ధర్మ పోరాట దీక్షలు చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో అదనపు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కేవీ కృష్ణారావు, జిల్లా అధ్యక్షులు బత్తిని మధు గౌడ్, గౌరవ అధ్యక్షులు బచ్చల పద్మాచారి, రాష్ట్ర కార్యదర్శి మోత్కూరి వెంకటేశ్వర చారి జిల్లా ఉపాధ్యక్షులు పార్థసారథి పుల్లూరు వెంకన్న బాబు,నాగరాజు యాదవ్ గుడిగంటి వీరన్న రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎస్కే చాంద్ పాషా ఎన్నిక




**పోరు తెలంగాణ జూలూరుపాడు ప్రతినిధి సురేష్ :** యాదాద్రి జిల్లా యాదగిరి లో జరిగిన ఏఐవైఎఫ్ మూడవ తెలంగాణ రాష్ట్ర మహాసభలో జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్కే చాంద్ పాషా ను రాష్ట్ర సమితి సభ్యుడుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించి యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా చేస్తున్నారని ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను మోసం చేస్తున్నారని.రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి హామీని నిలబెట్టుకోవాలని,రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు ఎంతో నమ్మకంతో రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు,సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా కు ధన్యవాదాలు తెలియజేశారు.

## కబ్జా నుండి విముక్తి కల్పించాలని కలెక్టర్ కు ఫిర్యాదు

**మహేశ్వరం, సెప్టెంబర్ 11,పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** దాసర్లపల్లి గ్రామంలోని గ్రామ కంఠం భూమిని కబ్జా నుండి కాపాడాలని కోరుతూ శుక్రవారం దాసర్లపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఫిర్యాదు ఆరోపించారు. ఆక్రమించిన సిమెంటు పలకలను, ఫెన్సింగ్ ను తొలగించాలని అన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి గ్రామ పంచాయతీ అధీనంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో మహేందర్, అంజయ్య, నరసింహ, జంగయ్య, బిక్షపతి, రమేష్, సాయిలు, మైసమ్మ, నరసింహ, యాదయ్య, బాలరాజ్, యాదయ్య, జంగయ్య, శ్రీరాములు, మహేష్ పాల్గొన్నారు.

## మద్దికల్ గ్రామపంచాయతీలో చేయూత పెన్షన్ వెరిఫికేషన్



**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 11 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేయూత పెన్షన్ పథకంలో భాగంగా మద్దికల్ గ్రామపంచాయతీ పరిధిలోని పింఛన్ అభ్యర్థుల వివరాలను భీమారం మండల ఎంపీవో సతీష్ రెడ్డి క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా గ్రామపంచాయతీ తరపున కృషి చేస్తామని సర్పంచ్ పొతేం సమయ్య తెలిపాడు

## చెంగల్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వెల్లడి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** భీమ్గల్ మండలంలోని చెంగల్ గ్రామంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేసింది. శుక్రవారం సర్పంచ్ ధూమల మమత,రాజు చేతుల మీదుగా గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహన్ గౌడ్,జిపిఓ రాజేందర్, కార్యదర్శి వినయ్,ఎఎంసి డైరెక్టర్ నరసాపురం జీవన్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆర్మూర్ రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్,రాజేశ్వర్,వసంత్ రెడ్డి, నర్సారెడ్డి, శోభన్ గౌడ్, తూర్పు శ్రీధర్, బాబా గౌడ్, లింబాద్రి, ప్రశాంత్ గౌడ్, ఆనంద్ గౌడ్, ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చిత్ర కళకు దక్కిన చిరు సత్కారం






**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపెల్లి జిల్లా సెప్టెంబర్ 11 శుక్రవారం ఓదెల మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ లో జరిగిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునీ ఉపాధ్యాయుల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన ఖ్యాతం రుక్కమ్మ రాజేశం కుమారుడైన చిత్ర కళాకారులు క్యాతం లింగమూర్తి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2015 సంవత్సరం నుండి 6వ,తరగతి నుండి 8వ, తరగతి వరకు ఆర్ట్ టీచర్ గా పని చేస్తున్నాడు. తన ప్రతిభను గుర్తించిన మండల విద్య శాఖ ఉత్తమ ఆర్ట్ టీచర్ గా ఎంపిక చేసింది. ఈ అవార్డును ఎంపీడీవో అనిల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ సతీష్ చేతుల మీదుగా శాలువాతో ఫీల్డ్, మెమొంటో అందజేసి ఘనంగా సన్మానించారు. అవార్డుకు ఎంపిక చేసినందుకు మండల విద్యాశాఖ కు లింగమూర్తి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, గ్రామ పద్మశాలి అధ్యక్షులు డాక్టర్ ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, భీష్మాచారి, శుభాకాంక్షలు తెలియజేశారు

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి: ఎంపీడీవో వీణ



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 11 :** భీమారం మండలం దాంపూర్ గ్రామపంచాయతీని ఎంపీడీవో వీణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గ్రామపంచాయతీలో చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలను వెరిఫికేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేగొండ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## మంచిర్యాల హైటెక్ సిటీలో రక్తదాన శిబిరం



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 11 :** సెప్టెంబర్ 14 వ తేదీన ఏకె ఫౌండేషన్ లయన్ లత జెట్టి పుట్టినరోజు సందర్భంగా తల సేమియా సికిల్ సెల్ వ్యాధి ఉన్నవారి కొరకు మంచిర్యాల హైటెక్ సిటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా 18 మంది పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగ నిలిచారు ఈ సందర్భంగా లయన్ లత జెట్టి మాట్లాడుతూ తాను ప్రతి సంవత్సరం ఒకసారి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు ఇకనుంచి ముందు ముందు ప్రజల సహకారంతో సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించాలని అనుకుంటున్నట్లు తెలియజేశారు గిగ ఫిట్నెస్ సెంటర్ నాగ మల్లేశ్వరరావు రాజేష్ ఖన్నా సాయికిరణ్ సత్యజిత్ రెడ్డి అనిల్ పవన్ కుమార్ వెంకటేశ్వరరావు సంజీవ్ రాజశేఖర్ ప్రవీణ్ ఫేత్ శ్రీనివాస్ చైతన్య నాగరాజు రంజిత్ కుమార్ కృపాకర్ సంతోష్ కుమార్ అరవింద్ అగర్వాల్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు ఈ కార్యక్రమంలో లయన్ లత జెట్టి లయన్ శ్రీనివాస్ రావు లయన్ వెంకటేశ్వర్లు లయన్ సత్యపాల్ లయన్ డాక్టర్ నరేష్ రెడ్ క్రాస్ సిబ్బంది ప్రణయ్ శిరీష హైటెక్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# చీకటిని తొలగించి వెలుగుని ప్రసాదించేది ఉపాధ్యాయులు




ముఖ్య అతిథి ఎంపీడీవో అనిల్ రెడ్డి



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపెల్లి జిల్లా సెప్టెంబర్ 11 శుక్రవారం ఓదెల మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రధనోత్సవం కార్యక్రమం మోడల్ స్కూల్లో నిర్వహించారు మండల విద్యాధికారి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో అనిల్ రెడ్డి హాజరైనారు ఎంపీడీవో మాట్లాడుతూ గురువులు నేర్పిన విద్య వల్లనే నేను ఈ స్థాయిలో ఉన్నానని గుర్తు చేశారు. విద్యార్థులకు విద్యను తీర్చిదిద్దిన ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఓదెల స్థానిక సర్పంచి కనికిరెడ్డి సతీష్ మాట్లాడుతూ చదువు అనేది కేవలం ఉద్యోగం కోసమే కాదని లోకజ్ఞానం నేర్పి బ్రతుకుతెరువు మార్గం చూపుతోందని అన్నారు. అలాగే ఉపాధ్యాయులు మాట్లాడుతూ తల్లి తండ్రి గురువు లాంటి స్థానాన్ని సమాజంలో ఎవరు భర్తీ చేయలేరు. విద్యార్థుల క్రమ శిక్షణ, మాట్లాడే విధానం , విద్యను బోధించే ఉపాధ్యా యులు సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారు. విద్యార్థులకు విద్య నేర్పించడం లో ఉపాధ్యాయులు యుద్ధంలా చేస్తున్నారు. ఎస్ .ఓ.జ్యోతి మాట్లాడుతూ విద్యార్థినిలకు విద్య నేర్పడంలో తల్లి స్థానాన్ని ఇస్తున్నట్టుగా ఉంది అని అన్నారు. జీలకుంట సర్పంచ్ రాగిడి మంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మనిషి జీవితంలో చీకటిని తొలగించి వెలుగును ప్రసాదించేది ఉపాధ్యాయులు మాత్రమే. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారు ఒక డాక్టర్, ఇంజనీర్ ,శాస్త్రవేత్త, ఉపాధ్యాయుని తయారు చేయగల శక్తి ఒక ఉపాద్యానికి మాత్రమేఉంటుందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేయాలని పేర్కొన్నారు. మడక హెచ్ఎం మాట్లాడుతూ సమాజం మొత్తం అరచేతిలో మొబైల్ ద్వారా కనబడుతుంది పిల్లలు విద్యా విషయంలో అప్డేట్ కావాలని మంచి విద్యను అందిస్తున్నామని అన్నారు. ఈవో రమేష్ మాట్లాడుతూ విద్యా వినయాన్నిస్తుంది, మానవుని జీవితంలో విద్య తొలి మెట్టు, విద్యార్థికి, సమాజానికి గురువు కనబడుటలేదు ఉపాధ్యాయుని పాత్ర సవాల్గా మారింది తరగతి గదిలో ఉపాధ్యాయుని పాత్ర తక్కువ సమయం అని పేర్కొన్నారు విద్యా విషయంలో రాష్ట్రస్థాయిలో పెద్దపల్లి జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు విద్యను బోధించడంలో జిల్లాలోని ఓదెల మండలం మొదటి స్థానంలో ఉందని అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో వాతావరణం, విద్యార్థుల ఆరోగ్యం కాపాడాలని సర్పంచ్లను ఎంఈఓ కోరినారు అలాగే మండలంలోని 4 ప్రభుత్వ పాఠశాలలు మూసి వేయబడ్డాయని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులుగా ఎంపికైన 45 మంది కి ఎంపీడీవో అనిల్ రెడ్డి చేతులమీరుగా మెమొంటో, షీల్డ్ ,శాలువా అందజేసి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సర్పంచులు , మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పిట్టల రవికుమార్, రవి యాదవ్, గోలి లింగారెడ్డి, చొప్పరి సంధ్యారాణి, పుప్పాల స్వప్న శంకర్, అంబాల సారమ్మ కొమురయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శిరీష, ప్రధానోపాధ్యాయులు పద్మ, కొలనూరు హెచ్ఎం ఏసుదాసు, శ్రీనివాస్, అశోక్ రెడ్డి, చందా రమేష్ ,మండలంలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులుపాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని

# అధికారికంగా నిర్వహించండి

చెన్నూరు మండల బిజెపి అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్ గౌడ్.



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 11 :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు బిజెపి చెన్నూరు మండల అధ్యక్షులు బుర్ర రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని శుక్రవారం ఎమ్మార్వో కార్యాలయంలో చెన్నూరు బీజేపీ ఆధ్వర్యం లో ఎమ్మార్వో కు వినతి పత్రం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చెన్నూర్ కౌన్సిలర్లు ఏతం శివకృష్ణ, గర్రెపెల్లి వెంకట నర్సయ్య, అడప శ్రీనివాస్, మనికరౌతు శంకర్, చాటరి వెంకటేష్, కర్నె వెంకట్, దీక్షిత్, సత్యం, వెంకన్న, కిష్టయ్య, సంపత్, శ్రీనివాస్, రజనికాంత్, చంద్రయ్య, మరియు చెన్నూరు పట్టణ మరియు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భాష్యం పాఠశాలలో మట్టి గణపతి ప్రతిమలు చేసిన విద్యార్థులు




**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలంలోని శ్రీ భాష్యం పాఠశాల లో శుక్రవారం విద్యార్థిని విద్యార్థులు తమ స్వహస్తలతో మట్టి గణపతి విగ్రహాలు తయారు. అనంతరం మట్టి ప్రతిమల ద్వార నీటి కాలుష్యం నివారించవచ్చని కరస్పాండెంట్ బుస రత్నాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందారం గ్రామపంచాయతీలో ఎంపీడీవో పర్యటన





**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 11 :** జైపూర్ మండలం ఇందారం గ్రామపంచాయతీ ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపూరావు సందర్శించడం జరిగింది, ఈ సందర్భంగా చేయూత పెన్షన్ దరఖాస్తుదారులను వెరిఫికేషన్ చేయడం జరిగింది, అదేవిధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ఓటర్ జాబితా గ్రీవెన్స్ లో వచ్చిన వాటిని పరిశీలించడం జరిగింది, గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని క్రమం తప్పకుండా వాటర్ ట్యాంకులు శుద్ధి చేయాలని క్లోరినేషన్ తప్పకుండా చేయాలని అదేవిధంగా గ్రామపంచాయతీలను రికార్డులు ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించాలని పంచాయత్ కార్యదర్శి కి సూచించడం జరిగింది, ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫయాజ్ , ఉప సర్పంచ్ ఎల్కటూరి శివ , వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, స్థానికులు పాల్గొనడం జరిగింది.

# పోచంపాడ్ సబ్ స్టేషన్ ను పరిశీలించిన జిల్లా ఎస్ ఈ రాజేశ్వర్ రావు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** పోచంపాడ్ 132/33 కేవీ సబ్ స్టేషన్ లో లోడ్ పరిస్థితిపై అధికారులు పరిశీలించారు. నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరాకు ముందస్తు చర్యలు చేపట్టారు. వినియోగదారులకు నాణ్యమైన,నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంతో జిల్లా సర్కిల్ ఎస్ఈ ఆపరేషన్స్ రాజేశ్వర్ రావు శుక్రవారం పోచంపాడ్లోని 132/33 కేవీ సబ్స్టేషన్ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్రాన్స్కో డీఈ/ఓఎం, ఏఈఈ/లైన్స్ అధికారులతో కలిసి సబ్స్టేషన్లోని వివిధ ఫీడర్ల లోడ్ పరిస్థితిని పరిశీలించారు. ప్రస్తుత లోడ్, సరఫరా పరిస్థితి, పీక్ లోడ్ సమయంలో ఎదురయ్యే సవాళ్లు తదితర అంశాలను సమీక్షించారు. ట్రాన్స్కో అధికారులు,డిస్కం అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ డిమాండ్కు అనుగుణంగా సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సబ్స్టేషన్లు, లైన్లు, విద్యుత్ పరికరాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులు సూచించారు. ఈ పరిశీలనలో ఆర్మూర్ డి.ఈ ఆపరేషన్స్ పెర్కిట్, అన్ని సబ్డివిజన్లకు చెందిన ఏఈలు పాల్గొన్నారు.

# పరామర్శ



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండలం మడక గ్రామములో ఇటీవల మరణించిన ఉల్లెంగుల రాయబోస్ కుమారుడు శ్రీనివాస్, మనుమడు పవన్ వారి కుటుంబసభ్యులనూ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ మండలం అధ్యక్షులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్,మాజీ ఎంపీటీసీ నోముల ఇంద్రారెడ్డి, గ్రామ అధ్యక్షులు గొర్ల కుమార్ నాయకులు ఆవుల రవీందర్,వెంకటరెడ్డి,గోషికలింగమూర్తి,సదరెడ్డి,సత్యనారాయణ రెడ్డి,సౌదరి రమేష్,తుడి సంపత్,గిద్దెమారి రమేష్,అసరికుమార్,మల్లారెడ్డి,గడ్డం అజయ్,గట్టు వినయ్,అమిదాల మొగిలి,ఐలయ్య,సమ్మిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు

# అటవీ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం : జిల్లా కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం సెప్టెంబరు 11 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** విధి నిర్వహణలో అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సేవలు, త్యాగాలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొత్తగూడెం ఇల్లందు క్రాస్‌రోడ్స్ లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ అమరవీరుల సంస్మరణ సభకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులు చలమల శ్రీనివాసరావు విగ్రహానికి జిల్లా కలెక్టర్ అంకిత్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమరవీరుల కుటుంబ సభ్యులు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , దేశవ్యాప్తంగా అటవీ సంపదను కాపాడే క్రమంలో ఎంతోమంది అటవీ శాఖ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడం, వారి సేవలను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని అన్నారు . అటవీ శాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది అటవీ సంపద సంరక్షణలో అత్యంత కీలకమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ, భద్రతా పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఇతర మౌలిక సౌకర్యాలను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నేరాల స్వభావం మారుతున్న నేపథ్యంలో అటవీ నేరాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక పరికరాలు, లైటింగ్, కమ్యూనికేషన్ తదితర సౌకర్యాలతో పాటు సిబ్బందికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ శాఖ సిబ్బంది కుటుంబ సభ్యుల త్యాగాలను కూడా సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని కలెక్టర్ అన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని అటవీ సంపదను పరిరక్షించేందుకు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేయాలని, కష్టపడి పనిచేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విస్తారమైన అటవీ ప్రాంతాన్ని కలిగి ఉందని, ఇక్కడి గిరిజన సమాజానికి అడవులతో ఎంతోకాలంగా సన్నిహిత సంబంధం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ, అటవీ హక్కులు తదితర అంశాలపై అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, గిరిజన సమాజాల భాగస్వామ్యంతో అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. అడవులను కాపాడటం, పర్యావరణాన్ని పరిరక్షించడం ఎంత ముఖ్యమో, అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల హక్కులను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యతను పాటిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అటవీ అమరవీరుల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో అటవీ సంపదను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా ఎస్పి రోహిత్ రాజ్ పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, సమాజం అండగా నిలవాలని, వారి త్యాగాలకు తగిన గౌరవం ఇవ్వాలని అన్నారు కార్యక్రమంలో జిల్లా ఎస్పి రోహిత్ రాజు,జిల్లా అటవీ అధికారి సిధార్ద్ విక్రమ్ సింగ్ , అటవీ శాఖ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఇతర అటవీ శాఖ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్య వైశ్యులు భూమి పూజకు భారీగా వచ్చి విజయవంతం చేయాలి: రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల విజయభాస్కర్








**పోరు తెలంగాణ జూలూరుపాడు ప్రతినిధి సురేష్ :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల13వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు హైదరాబాద్ ఉప్పల్ బగాయతులో ఆర్యవైశ్య మహాసభకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలంలో జరుగు భూమి పూజ( శంకుస్థాపన) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ స్టేట్ సెక్రటరీ పెండ్యాల విజయభాస్కర్ కోరారు. భూమి పూజ అనంతరం శ్రీనివాస కళ్యాణం,10 గంటలకు ఆత్మీయ సమ్మేళనం జరగనున్నట్లు అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు శ్రీ అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరుగు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి,తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,పలువురు మంత్రులు ఆర్యవైశ్య ప్రముఖులు టీజీ వెంకటేష్,బొగ్గారపు దయానంద్,ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా,బిగాల గణేష్ గుప్తా,కోలేటి దామోదర్,పలువురు ప్రముఖులు పాల్గొన నున్నట్లు ఆయన పేర్కొన్నారు,ఎంతో ప్రతిష్టాత్మక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల,మండలాలు పట్టణాల నుండి ఆర్యవైశ్య సోదర సోదరీమణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజయ భాస్కర్ కోరారు.

# మండల ప్రజల ఆరోగ్యానికి పెద్ద ముప్పు - 30 పడకల ఆసుపత్రి ఏర్పాటే పరిష్కారం

## పేదలకు అందని వైద్యం – నెక్కొండలో 30 పడకల ఆసుపత్రి కోసం గటిక అజయ్ పోరాటం



**పోరు తెలంగాణ నెక్కొండ, సెప్టెంబర్ 11 :** నెక్కొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని మాజీ ఎంపీపీ, తెలంగాణ పంచాయతీ రాజ్ మాజీ ట్రిబ్యునల్ సభ్యుడు గటిక అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెక్కొండ మండల పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలతో సహా పేద, బలహీన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారని, ప్రస్తుత పీహెచ్సీ లో సౌకర్యాలు సరిపోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో, ప్రసూతి సేవల కోసం, తీవ్ర అనారోగ్యాలకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల పేదలపై ఆర్థిక భారం పడుతోందన్నారు.

మండలంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, ప్రసూతి, అత్యవసర చికిత్సలు, చిన్నపాటి శస్త్రచికిత్సలకు అవసరమైన మౌలిక వసతులతో 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు అయితే నెక్కొండతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరు తుందని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే చొరవ తీసుకుని ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి సత్వర పరిష్కారం చూపాలి

అక్రమ ఇసుక, పశు రవాణాపై కఠిన చర్యలు

తీసుకోవాలి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్





**కొత్తగూడెం సెప్టెంబర్ 11 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : వార్షిక తనిఖీలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం విధుల్లో ఉన్న సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వివిధ వర్టికల్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రేవ్, ప్రాపర్టీ, దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిందితులను త్వరగా గుర్తించి అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన ఆస్తిని రికవరీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా అక్రమ పశు రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో భాగంగా గత నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాలు, బ్లూ కోట్స్ వాహనాల్లో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే స్పందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించిన అనంతరం పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు సీఐఆర్ పోర్టల్, ఈ సాక్ష, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీలక్ష్మి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ విజయసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# భూ రికార్డుల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 11, 2026 :** జిల్లాలో భూ రికార్డుల నవీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జి.పి.ఓ., ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల సర్వేయర్‌లతో నెన్నెల మండలంలోని చిన్న వెంకటాపూర్, పుప్పాలవానిపేట గ్రామాలలో భూ రికార్డుల నవీకరణకు సంబంధించి చేపడుతున్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ల్యాండ్ రిజిస్టర్ పూర్తి చేయడం, కొరిలేషన్ స్టేట్‌మెంట్ తయారీ, ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. భూ రికార్డుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, భూ రికార్డుల ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల కృషితోనే విద్యారంగంలో జిల్లా ముందంజ



జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**పోరు తెలంగాణ,మంచిర్యాల,సెప్టెంబర్ 11, 2026:** ఉపాధ్యాయుల కృషి, అంకితభావంతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనారిటీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, కార్పొరేటర్ సుధమల్ల హరికృష్ణ లతో కలిసి హాజరై డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెరగడంలో ఉపాధ్యాయుల కృషి కీలకమని, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులలో నమ్మకం పెంపొందించేందుకు ఉపాధ్యాయుల అంకితభావం ప్రధాన కారణమని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో సైతం విద్యార్థుల నమోదును మరింత పెంచడంతో పాటు ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు, బోధనలో నాణ్యతను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల లెర్నింగ్ ఔట్‌కమ్‌ను పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులకు దిశానిర్దేశం చేయడం ఉపాధ్యాయ వృత్తిలో కీలకమైన బాధ్యత అని తెలిపారు. ఉపాధ్యాయులు క్రమశిక్షణతో వ్యవహరిస్తూ అదే లక్షణాలను విద్యార్థులలో పెంపొందించాలని, విభిన్న బోధనా పద్ధతులను అనుసరించాలని సూచించారు. సాంకేతికత ఆధారంగా ప్రతి ఒక్కరికీ నేర్చుకునే అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, వసతి తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు. జిల్లాలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని, పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ అందించామని, ఎప్పటికప్పుడు నూతన విద్యా విధానాలను, సాంకేతికతను నేర్చుకుంటూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి విమర్శలు వచ్చినా వాటిని నిర్మాణాత్మకంగా స్వీకరించి విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడేలా పని చేయాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా విద్యార్థుల నమోదు, ఉత్తీర్ణతలో ముందు వరుసలో ఉండటం ఉపాధ్యాయ వర్గానికే గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసనలో, పాఠశాలల అభివృద్ధిలో తమ వంతు పాత్ర, అనుభవాలను వివరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 27 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఎన్రోల్మెంట్ సాధించిన 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవార్డులు, ఎన్.ఎం.ఎం.ఎస్. ద్వారా అధిక సంఖ్యలో స్కాలర్‌షిప్‌లు సాధించిన 3 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఎస్.ఎస్.సి. ఎన్రోల్మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 3 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం జిల్లా కలెక్టర్‌ను అధికారులు, ఉపాధ్యాయులు సన్మానించారు. వీఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించిన విద్యార్థులు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** మట్టి గణపతుల తయారీ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వర స్కూల్,మదర్ థెరిసా పాఠశాల,విద్యార్థులు పర్యావరణహిత మట్టి గణపతులను తయారు చేసి ఆదర్శంగా నిలిచారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), రసాయన రంగుల వినియోగం వల్ల కలిగే పర్యావరణ కాలుష్యంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు స్వహస్తాలతో బంకమట్టితో వినూత్న గణనాథుల ప్రతిమలను రూపొందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్ రామలక్ష్మితో పాటు ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, నరసింహా రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామలక్ష్మి మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, చిన్నతనం నుంచే పిల్లల్లో పర్యావరణ స్పృహను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. హెచ్‌ఎంలు సుబ్బారెడ్డి, నరసింహారెడ్డిలు మాట్లాడుతూ, పండుగలను ప్రకృతికి హాని కలగకుండా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించి జల వనరులను కాపాడాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తయారుచేసిన మట్టి ప్రతిమలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి- సీపీ అంబర్ కిషోర్ ఝా

విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో సమాచారం అందించాలి.

నిబంధనలకు లోబడి ఉత్సవాలు నిర్వహించాలి

**పోరు తెలంగాణ,పెద్దపల్లి, సెప్టెంబర్ 11 :** ఈ నెల 14వ తేదీ సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి పొందాలని రామగుండము పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.వినాయక విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తుదారుని వివరాలు,విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం,ఆ ప్రదేశం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు,వారి ఫోన్ నంబర్లు,విగ్రహాన్ని ప్రతిష్ఠించే తేదీ, నిమజ్జనం చేసే తేదీ, సమయం,ప్రదేశం, నిమజ్జనం చేసే ప్రదేశానికి చేరుకునే వాహనం వివరాలను నమోదు చేయాలి. అదేవిధంగా మండప నిర్వాహకులు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, వాలంటీర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామా తదితర వివరాలను కూడా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పట్టణాలు,గ్రామాల్లో ఏర్పాటు చేసే గణపతి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేయాలని కమిషనర్ సూచించారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయడంలో ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా కమిషనరేట్ పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉంటుందని, అత్యవసర సమయంలో వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు. మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ నిబంధనలకు లోబడి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు.



# చిట్టాపూర్, ప్రేమ్‌నగర్ ప్రాథమిక పాఠశాలల్లో ఎఫ్ ఎల్ ఎన్ సామర్థ్యాల పరిశీలన

విద్యార్థుల అభ్యసన స్థాయిల పై కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ పరిశీలన



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ ప్రాథమిక పాఠశాల, ప్రేమ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలను బాల్కొండ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ శుక్రవారం సందర్శించి, విద్యార్థుల ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ సామర్థ్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులను తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాల్లో ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో అక్షరాలు, పదాలు, వాక్యాలు, పేరాలు చదవడం మరియు అర్థం చేసుకోవడం, గణితంలో సంఖ్యాభావన, కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారం తదితర ప్రాథమిక అంశాలపై విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు.విద్యార్థుల స్పందన, అభ్యసన స్థాయిల పట్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తూ వారి ప్రాథమిక సామర్థ్యాలను మెరుగుపరచడంలో కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో పఠన, రచన, సంఖ్యా జ్ఞానం వంటి మౌలిక సామర్థ్యాలను బలోపేతం చేయడం ద్వారా భవిష్యత్ విద్యాభ్యాసానికి పటిష్ఠమైన పునాది ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చిట్టాపూర్, ప్రేమ్‌నగర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టి. రామస్వామి, శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ కం స్కావెంజర్ వేతనాలను నేరుగా బ్యాంక్ అకౌంట్లో జమ చేయాలి

టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు

ఎదులాపురం గోపాలరావు

సమస్యల పరిష్కారం కోసం ఎంఈఓ

కార్యాలయం ముందు ధర్నా





**పోరు తెలంగాణ జూలూరుపాడు ప్రతినిధి సురేష్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్ కం స్కావెంజర్లుగా పనిచేస్తున్న కార్మికులకు జీతాలను పాఠశాల కమిటీ చైర్మన్ లు ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండానేరుగా కార్మికుల బ్యాంక్ అకౌంట్లో జమ చేయాలని టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎదులాపురం గోపాలరావు, స్కావెంజర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నిమ్మటూరి లక్ష్మయ్య డిమాండ్ చేసారు.కార్మికుల వీసమస్యల పరిష్కారం కోసం ఎంఈఓ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించి,కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందచేశారు.అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులకు అతి తక్కువ వేతనం చెల్లించడం మూలంగా వారి కుటుంబాలు అర్ధాకలి తో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విధంగా స్వీపర్ కం స్కావెంజర్లను అనుస్కిల్డ్ కార్మికులుగా గుర్తించి 12,000 వేతనం అందించాలని వారు కోరారు. భద్రతలేని జీవితాలు గడుపుతున్న కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని,వారిని పూర్తి కాలం కార్మికులుగా గుర్తించి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని వారు కోరారు. పెండింగ్ లో ఉన్న మూడు నెలల వేతనాలను త్వరలో విడుదల చేస్తామని ఈ సందర్భంగా ఎంఈఓ జుంకిలాల్ ఫోన్ లో కార్మికుల కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నూనావత్ లక్ష్మణ్, జమలయ్య,మేరీ,రాజమణి, సౌజన్య,శేషమ్మ,రాధిక,కౌసల్య, సత్యవతి,లక్ష్మి ,ఉమారాణి, రాములమ్మ,శాంతి,సోనీ, తదితరులు పాల్గొన్నారు.

# డీజే వద్దు వీబాజా ముద్దు - సీఐ ఇంద్రాసేనారెడ్డి



**పోరు తెలంగాణ,పెద్దపల్లి, సెప్టెంబర్ 11 :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు గోదావరిఖని పోలీసుల ఆధ్వర్యంలో ఈరోజు గోదావరిఖని పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే ఆపరేటర్లు, యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖని ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు.మండప నిర్వాహకులు, భక్తులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.ఉత్సవాల్లో సాధారణ సౌండ్ సిస్టమ్‌ను మాత్రమే వినియోగించాలని, మైక్ సిస్టమ్‌ను రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి డీజే సౌండ్ సిస్టమ్‌ను వినియోగించినట్లయితే,సంబంధిత డీజే ఆపరేటర్లు, యజమానులు, మండప నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీజే ఆపరేటర్లు, యజమానులను ఈరోజు బైండోవర్ చేసినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. వీగణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని, అదే సమయంలో పోలీస్ శాఖ సూచించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి కోరారు డీజేకు దూరంగా ఉండి బాజాతో భక్తి భావాన్ని చాటుకుందాం. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించి గణనాథుని ఆశీర్వాదం పొందుదాం" అని ఇన్స్పెక్టర్ ఆకాంక్షించారు




# అక్రమ అరెస్టులు,నిర్బంధాలకు బీఆర్ఎస్ పార్టీ భయపడదు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్

యూత్ ప్రెసిడెంట్ గుండ్ల రంజిత్ కుమార్

**భద్రాద్రి కొత్తగూడెం పోరు తెలంగాణ(పినపాక నియోజకవర్గ ప్రతినిధి వల్లెపోగు రాము) కరకగూడెం, సెప్టెంబర్ 11:-** రాష్ట్రంలోని లక్షలాది మంది పేద విద్యార్థుల విద్యా భవిష్యత్తుకు భరోసానిచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వంపై కరకగూడెం మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ గుడ్ల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడుతున్నారని మండి పడ్డారు.హైదరాబాద్ ఇదిరా పార్క్ వద్ద న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా నిరసన,ధర్నా తెలపడానికి సిద్ధమైన నేపథ్యంలో ముందస్తుగా విద్యార్థి,యువజన నేతలను పోలీసులు అరెస్టులు చేయడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం అన్యాయం చేస్తే ఊరుకునేదే లేదన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షూ పంపిణీ




**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి పెద్దపల్లి జిల్లా సెప్టెంబర్ 11 శుక్రవారం** : ఓదెల మండలం హరిపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు షూల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ విద్యార్థులకు షూలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ నాగరాజు యాదవ్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో, శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా పెద్దపల్లి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన హరిపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేందర్ రెడ్డి ని గ్రామ సర్పంచ్ విజయ నాగరాజు యాదవ్ ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, పావని, హేమలత, ఉపసర్పంచ్ మాటూరి మహేందర్, ముప్పు రాకేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద భద్రతా నియమాలు తప్పనిసరి ఎస్ఐ మేడ ప్రసాద్



**బూర్గంపాడు సెప్టెంబర్ 11 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : గణేష్ మండపాల నిర్వాహకులు మండల సర్పంచులతో రాబోయే నవరాత్రుల గురించి శుక్రవారంనాడుసమావేశం నిర్వహించారు గణేష్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా https://policeportal.tspolice.gov.in/index.htm పోర్టల్ లో గణేష్ మండపానికి సంబంధించిన సమాచారం తప్పనిసరిగా ఇవ్వాలి. మండపాల నిర్వాహకులకు పోలీసుమార్గదర్శకా లు తెలిపారు గణేష్ మండప నిర్వాహకులు ముందస్తుగా ఆన్లైన్ మండపాల వివరాలను నమోదు చేసుకుని కచ్చితంగా అనుమతులు పొందాలి. మండపాలకు ఎలక్ట్రిసిటీ పర్మిషన్ తీసుకోవాలి. ట్రాఫిక్ కి అంతరాయం లేకుండా మండపాలు వేసుకోవాలి. మండపాల వద్ద మరియు ఊరేగింపులకు ఎలాంటి డీజే లు వాడరాదు. ఉత్సవాల సందర్భంగా ఇతరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రతి మండపం వద్ద కనీసం ముగ్గురు వాలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండేలాగా చూసుకోవాలి. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అగ్నిప్రమాదాల నివారణకు తప్పనిసరిగా ఇసుక బకెట్లు, నీటి వసతి లేదా ఫైర్ ఎక్స్టింగ్యూషర్లు అందుబాటులో ఉంచుకోవాలి. తెలిపారు రాత్రి 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లౌడ్ డిజే లు వినియోగించరాదు, ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా లేదా రెచ్చగొట్టేలా ఉండే పాటలు, నినాదాలను పూర్తిగా నిషేధించారు. అత్యవసర పరిస్థితులలో 112 కాల్ చేసి సమాచారం తెలపాలని కోరారు

## ట్రైనీ ఎఫ్ఆర్ఓల క్షేత్రస్థాయి పర్యటన



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : సిర్పూర్ రేంజ్ పరిధిలోని ఇటుకలపహాడ్ బీట్‌లో ట్రైనీ ఎఫ్ఆర్ఓలు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా టైగర్ ట్రాకింగ్ విధానం, ప్లాంటేషన్‌ను విజయవంతం చేసేందుకు చేపట్టిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణకు గురైన అటవీ భూమిని తిరిగి వన్యప్రాణులకు అనువైన ప్రాంతంగా మార్చేందుకు చేపట్టిన చర్యలకు సెక్షన్ ఆఫీసర్ మోహన్‌రావును ట్రైనీ ఎఫ్ఆర్ఓలు అభినందించారు. కార్యక్రమంలో డీఆర్వో ప్రవీణ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ మోహన్‌రావు, బీట్ ఆఫీసర్లు అరుణ్‌రెడ్డి, రవీనా, వాచర్లు పాల్గొన్నారు.

## వంజిరిలో ఘనంగాం పొలాల అమావాస్య పూజలు



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి గ్రామ పంచాయతీలో పొలాల అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం హనుమాన్ మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని రైతులు తమ ఇళ్లలోని ఎద్దులను తీసుకువచ్చి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వంజిరి ఉప సర్పంచ్ భరత్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు విజయ్, తుకారాం, రమేష్, మెంగరాజ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ సంప్రదాయాలు, రైతుల జీవన విధానంలో భాగమైన పొలాల అమావాస్య వేడుకలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేసిన అజ్మీర శ్యామ్ నాయక్



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కును ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి అజ్మీర శ్యామ్ నాయక్ అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని శ్యామ్ నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మంగ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైరాగడ్ మారుతి పటేల్, జక్కయ్య, సీనియర్ నాయకులు నిజం, మార్కెట్ వైస్ చైర్మన్ రవీందర్, మాజీ సర్పంచ్ కాశన్నా, రాజు అంబారావు, నరేందర్, మల్లేష్ బాలు తదితరులు పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణలో అటవీ అధికారుల పాత్ర కీలకమైనది


జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 11, 2026** : అడవులను రక్షించి పర్యావరణాన్ని కాపాడడంలో అటవీశాఖ అధికారుల పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని మందమర్రి మండలం గాంధారి వనం ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమానికి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారామ్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి హాజరై అటవీ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం అటవీ ప్రాంతంపై పడుతుందని, ఈ క్రమంలో అడవులు, పర్యావరణాన్ని కాపాడడంలో అటవీశాఖ అధికారులు విశిష్ట కృషి చేస్తారని తెలిపారు. ఆదివాసి గిరిజనుల హక్కులను కాపాడుతూనే అటవీ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అడవులను రక్షించడం ద్వారా భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించడం జరుగుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అందించినట్లు అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జిల్లా అటవీ అధికారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది సైతం రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి జిల్లా కలెక్టర్ ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు మరో ఇద్దరికీ మేవా ఆర్థికసాయం




**బూర్గంపాడు, సెప్టెంబరు 11 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామానికి చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) వెల్ఫేర్ సొసైటీ. ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండల కేంద్రంకు చెందిన ఇద్దరికి వైద్య ఖర్చులకోసం 10000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు గత కొంత కాలం గా అనారోగ్యంతో బాధపడుతున్న బీయమ్మ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాదు హాస్పటల్లో చికిత్స పొందుతున్నాడు ఆర్థిక సహాయం కోసం శ్రీ కుటుంబ సభ్యులు మేవా కమిటీని సంప్రదించగా కమిటీ నిర్ణయం మేరకు బీయమ్మ కు ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయ అందించారు.. అదేవిధంగా మండల కేంద్రంకు చెందిన ఆటో డ్రైవర్ జానీ అనారోగ్యంతో బాధపడుతూన్నాడు వైద్యం చేయించుకుంటున్నారు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి గమనించి మేవా కమిటీ తరఫున వారికి కూడా 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మేవా ప్రతినిధులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి తమ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఇందులో భాగస్వామి అయిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసు కుంటున్నామన్నరు బీయమ్మ మరియు జానీ గారి ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని కోరుకుంటున్నామన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు షేక్ దస్తగిరి. మేవా కమిటీ అధ్యక్షులు మహమ్మద్ ముస్తఫా.సోహెల్ పాషా తదితరులు పాల్గొన్నారు

## కామారెడ్డి జిల్లా ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### ప్రొటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 పోరు తెలంగాణ న్యూస్ తెలంగాణ న్యూస్:** సెప్టెంబర్ 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో, పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించి వేదిక, ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్, ఇతర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఎజాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో అనుసరించాల్సిన నిబంధనలు, మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి తాగునీరు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. వివిధ శాఖల జిల్లా అధికారులు తమ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ గౌరవ వందనం, బందోబస్తు తదితర అంశాలపై పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వేడుకలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డి ఆర్ ఓ పాండు, డీఆర్‌డీఓ పీడీ దామోదర్ రెడ్డి, జడ్పీ సీఈఓ చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల ధర్మ పోరాటానికి అజ్మీరా శ్యామ్ నాయక్ మద్దతు



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బీసీల హక్కులు, సమాన ప్రాతినిధ్యం కోసం దేశవ్యాప్తంగా కొనసాగుతున్న బీసీల ధర్మ పోరాటంలో భాగంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ పాల్గొన్నారు. ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని, ప్రతి కులానికి ఒక యూనిట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.దేశ జనాభాలో బీసీలు అత్యధిక సంఖ్యలో ఉన్నప్పటికీ రావాల్సిన స్థాయిలో రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం దక్కడం లేదని, ప్రతి బీసీ కులానికి సముచిత ప్రాతినిధ్యం కల్పించి జనాభా ప్రాతిపదికన అవకాశాలు ఇవ్వాలని అజ్మీరా శ్యామ్ నాయక్ పేర్కొన్నారు. బీసీల హక్కుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని, న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మంగ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైరాగడ్ మారుతి పటేల్, జక్కయ్య, నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాల నెపంతో మైనర్ బాలిక తో అసబ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు



**పోరు తెలంగాణ, మంచిర్యాల, సెప్టెంబర్ 11** : తేది: 10.09.2026 రోజున లక్షెట్టిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదిదారు ఇచ్చిన పిర్యాదు మేరకు ధర్మపురికి చెందిన బాధితురాలి తల్లి తన కూతురుకి ఆరోగ్యం బాగులేక పోవడంతో లక్షెట్టిపేట్ గోదావరి రోడ్ కి చెందిన ఒక వ్యక్తి జాతకాలు చూసి బాగు చేస్తాడని తెలిసి తేది: 08.09.2026 రోజున లక్షెట్టిపేట్ గోదావరి రోడ్ కి చెందిన పెండెం సతీష్ అను వ్యక్తి దగ్గరకి రాగ అట్టి పెండెం సతీష్ అను వ్యక్తి ఇదే అదును అనుకుని అట్టి అమ్మాయి(బాధితురాలు)ని ఒంటరిగా పూజ రూమ్ పక్కన బయట వైపు తీసుకెళ్ళి అసబ్యకరంగా ప్రవర్తించి, లైంగికంగా వేదించినాడు. ఇట్టి విషయాన్నీ తల్లి తండ్రులకి చెప్తే చంపుతానని బెదిరించగా బాదితురాలు ఆ రోజు ఎం చెప్పలేదు. తిరిగి తేది: 10.09.2026 రోజున అమ్మాయి ఇట్టి విషయం తల్లి తండ్రులకి చెప్పగా, అమ్మాయి తల్లి లక్షెట్టిపేట్ పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇవ్వగా ఇట్టి పెండెం సతీష్ పై పోక్సో కేసు నమోదు చేసి పోలీస్ లు ఇట్టి దర్యాప్తు లో బాగంగా పెండెం సతీష్ ని రిమాండ్ నిమిత్తం కోర్ట్ ముందు హాజరు పరుస్తున్నాం. ఈ కేసును సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలపై, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఉత్తర్వుల మేరకు, మంచిర్యాల ఏసీపీ , =. ప్రకాశ్ పర్యవేక్షణలో, లక్షెట్టిపేట సీఐ రమణ మూర్తి, లక్షెట్టిపేట ఎస్సై సురేష్, సిబ్బంది చాక చక్యంగా నిందితుడిని పట్టుకోవడం జరిగింది. ఇట్టి నిందితుడిని పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన లక్షెట్టిపేట సీఐ రమణ మూర్తి, లక్షెట్టిపేట ఎస్సై సురేష్ ని, సిబ్బంది ఎ ఎస్సై అన్వర్ హుస్సేన్, హెచ్ సి వసంత్, పి సి సుధాకర్, రాజమౌళి, సత్యనారాయణ, మల్లేష్, కుమారస్వామి, సాంబరి రమేష్, రవీందర్, బానావత్ రమేష్, మహేష్, తిరుపతి, శ్రీకాంత్, ప్రేం సాగర్, సాగర్, మనీషా, ప్రవలికలను సీపీ , డీసీపీ అబినందించినారు.

**హెచ్చరిక :**

లక్షెట్టిపేట్ సర్కిల్ పరిదిలో పట్టణ, గ్రామీణ ప్రజలందరికి తెలియచేయునది ఏమనగా మాయలు, మంత్రాలు, తంత్రాల, కడుపులో మందు పోయడం, ఎత్తి పోయడం లాంటి మూడ నమ్మకాలు లాంటివి ఉండవు, ఇట్టి మూడ నమ్మకాలు నమ్మి ఎవరు మోసపోవద్దు. మంత్రాల ద్వారా రోగాలు నయమవుతాయని, గుప్తనిధులు లభిస్తాయని లేదా ఇతరులకు కీడు జరుగుతుందని చెప్పే దొంగ బాబాలు, మంత్రగాళ్ల మాటలను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దు. శారీరక లేదా మానసిక అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే అర్హత కలిగిన వైద్యులను లేదా ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలి తప్ప, మంత్రగాళ్ల వద్దకు వెళ్లి సమయాన్ని, ప్రాణాలను పణంగా పెట్టవద్దు. ఈ విధమైన చర్యలు సమాజ శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా చట్టరీత్యా తీవ్రమైన నేరం. ఇట్టి నమ్మకాలతో అమాయక ప్రజలను మోసం చేయడానికి ఎవరైనా పాల్పడితే కటిన చర్యలు తీసుకోబడుతా పోలీస్ లు హెచ్చరించారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన అజ్మీరా శ్యామ్ నాయక్

### తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్ ఆధ్వర్యంలో జైనూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాల్సిన విషయమని, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని అజ్మీరా శ్యామ్ నాయక్ పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు తమ హోదాకు తగిన బాధ్యతాయుతమైన భాష ఉపయోగించాలని, రాజకీయ విభేదాల పేరుతో రాజ్యాంగబద్ధ పదవులను అవమానించడంసరికాదని అన్నారు.ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావు, జైనూర్ సిర్పూర్ యూ మండలాల అధ్యక్షులు షైక్ రషీద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

నిల్వ కేంద్రాలను ముందస్తుగా గుర్తించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్..



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11. (పోరు తెలంగాణ న్యూస్:):** ఖరీఫ్ 2026--27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం కలెక్టర్ సీఎస్, డీసీఎస్ఓ, డీఎం సీఎస్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం నిల్వకు అందుబాటులో ఉన్న గోదాములు, ఇతర నిల్వ ప్రదేశాలను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధికారులు, సంబంధిత తహసీల్దార్లు, డీటీ సీఎస్‌లు సంయుక్తంగా పరిశీలించి గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గుర్తించిన నిల్వ కేంద్రాల వివరాలను సమగ్రంగా నివేదించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సౌకర్యవంతంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం నిల్వకు అవసరమైన ప్రదేశాల గుర్తింపు, రవాణా తదితర అంశాలపై ముందుగానే సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ, అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళమెత్తిన హరీష్ బాబు



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 11:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: హైదరాబాద్ సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు శాసనసభలో పలు ప్రజా సమస్యలనులి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పంచాయతీలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది వేలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు పట్టాలు పొందుతున్నప్పటికీ, వారికి తగిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించడం లేదని అన్నారు. ఐటీ రంగంలో పెట్టుబడులకు అనుగుణంగా స్థానిక యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సిద్దిపేట, కరీంనగర్‌లోని ఐటీ టవర్లను పూర్తిస్థాయిలో వినియోగించి ఉపాధి అవకాశాలు పెంచాలని కోరారు. రైతుల సమస్యలపై స్పందించిన హరీష్ బాబు పంట నష్టాల సమయంలో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ట్రాన్స్‌జెండర్లకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు వారి వైద్యం, ఉపాధి, సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి, ఆ రోజును తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని అసెంబ్లీలో హరీష్ బాబు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి చర్యలు



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 11:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: మురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీ పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు శుక్రవారం నిర్వహించారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ల పోస్టులను ఒక సంవత్సరం కాలపరిమితికి ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, (రెవెన్యూ) ఎం.డేవిడ్ సంయుక్తంగా తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్య, శిక్షణ అందించడంతో పాటు అనుబంధ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన బోధనా సిబ్బందిని సమకూర్చడం ఈ చర్యల లక్ష్యం. వైద్య విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

## ఆసిఫాబాద్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లోడ్లను పరిశీలించిన ఎస్ఈ ఉత్తమ్ జాడె



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 11:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడె శుక్రవారం 132/33 కేవీ ఆసిఫాబాద్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, ఫీడర్ల వారీగా విద్యుత్ లోడ్ వివరాలను తనిఖీ చేశారు. పీక్ అవర్స్‌లో విద్యుత్ డిమాండ్, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. రాబోయే కాలంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉన్నందున లోడ్ బ్యాలెన్సింగ్, గ్రిడ్ భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా పనిచేయాలని స్థానిక ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ ఓపీ దుస్సా శ్రీనివాస్, సబ్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళితులు నడిచిన నేల అపవిత్రమా? కేసీఆర్ ఫామ్‌హౌస్ వివాదంపై దళిత సంఘాల ఆగ్రహం

ఫామ్‌హౌస్ వద్ద 'శుద్ధి' కార్యక్రమం - దళిత వర్గాల్లో తీవ్ర ఆవేదన

**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 11:** దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలపై దళిత సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సామాజిక సమానత్వం దిశగా సమాజం పయనిస్తున్న వేళ, వివక్షను గుర్తు చేసే చర్యలు చోటుచేసుకోవడం బాధాకరమని వారు పేర్కొంటున్నారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఫామ్‌హౌస్ వద్ద జరిగిన పరిణామాలే ఇందుకు కారణం. తమ నేతలకు వ్యతిరేకంగా దళిత సంఘాలు, కాంగ్రెస్ రాజ విభాగం నేతలు డప్పు చప్పుళ్లతో నిరసన తెలిపిన అనంతరం, ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేశామంటూ భారత రాష్ట్ర సమితి వర్గాల నుంచి వచ్చిన ప్రకటన దుమారం రేపింది.

**సమానత్వ స్ఫూర్తికి విరుద్ధం**

దశాబ్దాలుగా సమాన హక్కులు, గౌరవం కోసం పోరాడుతున్న దళిత సమాజాన్ని అపవిత్రతకు ఆపాదించే భావనలకు ఆధునిక సమాజంలో స్థానం లేదని దళిత వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఇలాంటి ప్రకటనలు రాజ్యాంగం అందించిన సమానత్వ విలువలకు, డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశించిన ఆత్మగౌరవ సమాజానికి విరుద్ధమని అంటున్నారు. రాజకీయ భేదాలు ఏవైనా ఉండొచ్చు, కానీ ఒక సామాజిక వర్గం మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు, ప్రకటనలు చేయరాదని, బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదంపై సంబంధిత పార్టీ అధిష్టానం స్పందించి, దళితుల మనోభావాలను గౌరవించేలా వివరణ ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని దళిత సంఘాల నేతలు కోరుతున్నారు.

# మండల సమావేశంలో సమస్యలపై సర్పంచుల గళం

విద్యుత్ స్తంభాలు.. ప్రభుత్వ భూములు..
సర్టిఫికెట్ల జాప్యంపై ఫిర్యాదులు
కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
50 పడకల ఆసుపత్రి, న్యాయస్థానం ఏర్పాటుపై అధికారుల వెల్లడి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి దోమకొండ, సెప్టెంబర్ 11 :(పోరు తెలంగాణ న్యూస్:):** దోమకొండ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా శాఖల పరిధిలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సర్పంచులు కోరారు.

విద్యుత్ సమస్యలపై సర్పంచుల ఆవేదన

విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో స్థానికంగా ఏఈ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు సర్పంచులు తెలిపారు. గొట్టిముక్కల సర్పంచ్ సంజీవ్ మాట్లాడుతూ గ్రామంలో తొమ్మిది విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాల సమస్యలు ఉన్నాయని తెలిపారు. సంగమేశ్వర్ సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులకు సంబంధించిన సర్‌చార్జీల సమస్యను పరిష్కరించాలని కోరారు.

**కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలి**

మండలంలోని కల్లు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల స్థాయి సమీక్షా సమావేశంలో ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో కల్లు దుకాణాల నిర్వహణ, నిబంధనల అమలుపై ఎక్సైజ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సర్పంచులు కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కల్లు దుకాణాల విషయంలో ఫిర్యాదులు చేసినప్పటికీ ఎక్సైజ్ అధికారులు స్పందించడం లేదని కొందరు సర్పంచులు ఆరోపించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**50 పడకల ఆసుపత్రికి చర్యలు**

ఎంఆర్వో స్వప్న మాట్లాడుతూ దోమకొండలో 50 పడకల ఆసుపత్రి స్థలం ఏర్పాటుకు సంబంధించి వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లుతో చర్చించి అవసరమైన ఏర్పాట్లకు త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే న్యాయస్థానం ఏర్పాటుకు అవసరమైన వసతి, స్థల కేటాయింపుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో సవరణలకు సంబంధించిన నోటీసులను ప్రజలకు అందజేస్తున్నట్లు తెలిపారు. సవరణల కోసం ఫారం 6, 7, 8 అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

**ప్రభుత్వ భూములను రీసర్వే చేయాలి**

సంగమేశ్వర్ సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను రీసర్వే చేయాలని ఎంఆర్వోను కోరారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌కు సంబంధించి గత పదేళ్లుగా అధికారులు, సర్పంచులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దేవాలయ భూములకు సంబంధించిన సమస్యలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**సర్టిఫికెట్ల జారీలో జాప్యంపై ఫిర్యాదు**

రెవెన్యూ కార్యాలయంలో వివిధ సర్టిఫికెట్ల జారీకి ఎక్కువ సమయం పడుతోందని సర్పంచులు తెలిపారు. అంచనూర్ సర్పంచ్ జనగామ నరేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని కోరారు.

**అంగన్వాడీల్లో పౌష్టికాహారం**

మండలంలోని గ్రామీణ ప్రాంతాలు, తండాల్లో అంగన్వాడీ టీచర్ల నియామకానికి గతంలో నోటిఫికేషన్ జారీ చేయగా అర్హులు దరఖాస్తు చేసుకున్నారని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. గర్భిణులకు ఆరోగ్యలక్ష్మి పథకం కింద పోషకాహారం అందిస్తున్నామని, ఆరు నెలల నుంచి పిల్లలకు ప్రతిరోజూ గుడ్డు, పౌష్టికాహారం, బాలామృతం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

**అంగన్వాడీ భవనానికి నిధులు ఇవ్వాలి**

సంగమేశ్వర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయించినప్పటికీ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు, విధివిధానాలు స్పష్టంగా లేకపోవడంతో నిర్మాణం చేపట్టలేకపోతున్నామని సర్పంచ్ డోలుపల్లి శ్రీనివాస్ తెలిపారు. భవనం నిర్మించిన అనంతరం నిధులు ఎప్పటిలోగా వస్తాయో స్పష్టత ఇవ్వాలని కోరారు.

**ఆసుపత్రిలో రోజుకు 400కుపైగా ఓపీ**

వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు, జ్వరాలు, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో రోజుకు 400కు పైగా ఓపీ నమోదవుతోందని తెలిపారు. స్త్రీలకు సంబంధించిన వైద్య సేవల కోసం మహిళా వైద్యురాలు, ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. అవసరమైన వైద్య సిబ్బంది, నిపుణుల నియామకం జరిగితే ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను శాఖల వారీగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు,వివిధ మండల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులకు వేగవంతమైన పరిష్కారం, నేరాల నియంత్రణకు కఠిన చర్యలు

ఎస్పీ నితికా పంత్ ఆదేశం....





**పోరు తెలంగాణ సెప్టెంబర్ 11:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ నేలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో నేరస్తులకు శిక్ష పడేలా చేసి బాధితులకు న్యాయం అందించాలని, కేసుల విచారణలో జాప్యం చేయరాదని ఆదేశాలు జారీ చేశారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతర గస్తీ కాస్తూ డయల్ 112 కాల్స్‌కు వేగంగా స్పందించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. కేసుల నమోదు, దర్యాప్తు, నేరస్థుల వివరాల నిర్వహణలో సీసీటీఎన్ఎస్‌ను సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. గంజాయి, మట్కా, జూదం, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు తమ నివాస, వ్యాపార ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రాపర్టీ కేసుల్లో సాంకేతికత వినియోగించి సొత్తు రికవరీ చేసి బాధితులకు త్వరగా అందించాలని, సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై, ర్యాష్ డ్రైవింగ్‌పై నిరంతర వాహన తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబంది, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని ఆదేశించారు. రానున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# అంగరంగ వైభవంగా భవాని మాత, ఎల్లమ్మ తల్లి గుట్ట జాతర

భక్తజన సందోహంతో మార్మోగిన బోడగుట్ట....





**పోరు తెలంగాణ సెప్టెంబర్ 11:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని సరండి గ్రామ శివారులోని బోడగుట్టపై కొలువుదీరిన భవాని మాత, ఎల్లమ్మ తల్లి జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. పోలాల అమావాస్య మరుసటి రోజున ఏటా నిర్వహించే జాతరకు ఈసారి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భాజా బజంత్రీల నడుమ గుట్టపైకి చేరుకున్న భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రాకతో సరండి గ్రామం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. తొలి జాతరను ఘనంగా నిర్వహించిన సర్పంచ్ బాపూజీ సరండి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా మొహర్లే బాపూజీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా జరిగిన జాతర కావడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్యం, రాకపోకలు, వాహనాల క్రమబద్ధీకరణ తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతరకు భారీగా భక్తులు తరలిరావడం ఆనందంగా ఉందని, భవిష్యత్‌లో మరింత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని బాపూజీ తెలిపారు. పటిష్ఠ బందోబస్తు జాతరకు భారీగా భక్తులు రావడంతో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. గుట్టకు వెళ్లే మార్గాల్లో రద్దీని క్రమబద్ధీకరించడంతో పాటు వాహనాల రాకపోకలను నియంత్రించారు. సీఐ వేణుగోపాల్, ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు భక్తుల భద్రతను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాతర ప్రశాంతంగా ముగిసింది. జాతర విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామపంచాయతీ సిబ్బంది, యువత, గ్రామస్థులు సమన్వయంతో పనిచేశారు. భక్తులకు కల్పించిన సౌకర్యాలపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ జాతర గ్రామస్థుల ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.

## మట్టి వినాయకులనే పూజిద్దాం

వాతావరణ సమతుల్యతను కాపాడుకుందాం:
హెచ్ఎం శ్రవణ్ కుమార్



**పోరు తెలంగాణ నెక్కొండ, సెప్టెంబర్ 11:** ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని, ప్రకృతిని, వాతావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని అప్పలరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూర్గుపల్లి శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నెక్కొండ మండలం అప్పలరావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను ఉత్సాహంగా తయారు చేశారు. విద్యార్థులు తయారుచేసిన విగ్రహాలను పంపిణీ చేసి అనంతరం నిర్వహించిన సమావేశంలో హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో మట్టి విగ్రహాలను తయారు చేయడమే కాకుండా, గ్రామస్థులకు కూడా వీటి వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. రసాయన రంగులు లేని మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా జలవనరులను, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా అత్యంత ప్రతిభావంతంగా మట్టి విగ్రహాలను రూపొందించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్రనాథ్, గీత, భూలక్ష్మి, వెంకట్రాజం, దయాకర్, యాకయ్య, సునీత తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## 'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

ఆర్యవైశ్యులు ఏకతాటిపై నిలవాలి:
మండల అధ్యక్షుడు తాటిపల్లి శివకుమార్



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 11:** ఆర్యవైశ్యుల ఐక్యతను చాటడంతోపాటు ఆత్మగౌరవాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు తాటిపల్లి శివకుమార్ పిలుపునిచ్చారు. సంఘటిత శక్తితోనే సామాజికంగా ఎదురయ్యే సమస్యలను సమర్థంగా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులంతా విభేదాలకు , పార్టీలకు, రాజకీయాలకు,అతీతంగా ఏకతాటిపై నిలిచి, తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనం ఐక్యతకు వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. మండలంలోని ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.